త్తేమి ప్రత్యుత్తరము నియఁగలదు? ప్రజావిశ్వాసముల నీపరిషత్తు ఏల కోలుపోవలసివచ్చినది? అసహాయముగ స్వశక్తిపై నాధారపడి స్వవ్యయములతో ఆంధ్రవిజ్ఞానసర్వస్వము, ఆంధ్రైతిహాసికపరిశోధకమండలి.— పరిశోధకమహామండలి— తెలుగుభాషకు గావించిన సేవలో పరిషత్తు సహస్రాంశము గాని భాష కని యెత్తి జూపఁదగిన సేవ యొకటియేని లేదు. ఎన్నియో సంస్థలు, పత్రికలు, గ్రంథమాలలు ప్రజాదరము లేక యంతరించుచుండ, ఎందఱో పండితులు పని లేక అన్నార్తులై పంచలఁ బట్టి తిరుగుచుండ పరిషత్తు ఎట్టిసహాయము చేయక తన కాయువ్య మస్తు అన్నటులఁ గాలము గడపినది. ఇపు డీపరిషత్తు నుద్ధరించువా రెవరు? ఉద్ధరించిన నిది చేయవలసిన పని యేమి? పంద్రెండేండ్లనుండి తెలుపని సందేశ మింకముం దాంధ్రులకు ఏమని తెలిపి పలుకుబడి నార్జింపఁగలుగును.

ఆంధ్రసాహిత్యపరిషత్తు ఏర్పడిన పిదప కొన్ని సంవత్సరముల కితరభాషల లోఁగూడ నిటులే పరిషత్తు లేర్పడెను. అవి యా యా సారస్వతములకు సేవఁ జేయుచున్నవి. కాని యాంధ్రసాహిత్యపరిషత్తుమాత్ర మటులఁ జేయుట లేదు. ఇట్టి స్థితిలోఁ బరిషత్తున కిఁక వృథార్భాటము లనవసరములు. అద్దెలతో ఉద్యోగులు వేతనములతో ఆర్భాటములతోఁ గాలము గడుపక పరిషత్తును రాజమహేంద్రమువారు కోరినటుల గౌతమీగ్రంథాలయమందిరమునఁ జేర్చి దానిలోఁ గలుపుటయే మంచి దని తోఁచుచున్నది. సంవత్సరమున కొక వార్షికోత్సవము పెట్టి రాజరాజనరేంద్రపట్టాభిషేకసంచికవంటి యొకసంచికను నివేదికను ప్రచురించుచున్న భాషాసేవ చేసి నటు లగును. ఇందుల కొకప్రత్యేకకార్యస్థానము పత్రికానిర్వహణము నిర్వాహకవర్గవ్యయములు అనవసరము లని తొల్లింటి నివేదికలవలనఁ దెలియుచున్నది. ......లున్ననుముందుఁ బరిషత్తువారైనను ఇతరపరిషత్పరిచయు లైన ఈక్రింది ప్రశ్నములకుఁ బ్రత్యుత్తరము లీయఁగోరుచున్నారము.

(1) పరిషత్తునకు స్థాపించినది మొదలు నేటివఱకు చందాల వలన విరాళముల వలన వసూ లయిన మొత్తము ఎంత?

(2) తాళపత్రగ్రంథముల కయి యెంతవ్యయము గావింపఁబడెను? నిలువ పుస్తకము లెన్ని? అందెన్ని (పత్రికలో గాక) స్వంతముగా ముద్రించినారు? ఎన్ని జీర్ణగ్రంథములు తిరిగి ప్రతులు వ్రాయించినారు? ఇందులకు ఎంత మొత్తము వ్యయము చేయఁబడినది?

(3) పరిషత్కార్యనిర్వాహకవర్గమునకు ఇంటియద్దెకు వ్యయము ప్రతిమాసమునకు ఎంత యగుచున్నది? నిర్వాహకవర్గములోని పండితులు చేయవలసిన నియతకృత్యము లేవి? వీ రేమేని జీర్ణగ్రంథములకు బ్రత్యంతరములు వ్రాయుట పత్రికను వ్యాప్తిలోనికి దెచ్చుట లోనగు పనులు చేయుచున్నారా?

(4) పరిషత్తునకు స్థాపించినది మొదలు నేటివఱకు వచ్చు ఆదాయమెంత? (సంవత్సరముల వారిగా) ఉద్ధారకులు, పోషకులు యావజ్జీవసభ్యులు సాధారణ సభ్యులు చందాదారులు ఎందఱు? క్రమముగాఁ బై వారి సంఖ్య హెచ్చినదా? తగ్గినదా? ఇందులకుఁ బరిషత్తు చెప్పవలసిన ప్రధానకారణము లేవి?

(5) పరిషత్పత్రిక ఎన్ని ప్రతులు ముద్రింపబడుచున్నవి? అందెన్ని చందాదారులకుఁ బంపబడుచున్నవి? ఇతరపత్రికలకంటె పరిషత్పత్రికకు చందాదారులు తక్కువగా నుండుటకుఁ గారణమేమి? పత్రికాప్రచరణమునకు పరిషత్తువా రేమేని ప్రత్యేకము లగు ఏర్పాటులను చేయుచున్నారా?

(6) పరిషత్తు ప్రస్తుతము ఎంత నిలువలో నున్నది? ధనరూపముగా గ్రంథరూపముగ పత్రికారూపముగా—బాకీలతో ఎంత ఆస్తి కలిగియున్నది? పరిషత్తు ప్రజావిశ్వాసపాత్ర మగు సంస్థగా మార్పుఁదలఁచినచో నెట్టి సంస్కారము లావశ్యకములు?

(7) నిత్యము (మాసము లేక సంవత్సరము అవరేజిబట్టి) ఎంతమంది పాఠకులు గ్రాహకులు లేఖకులు గ్రంథములను ఉపయోగించు కొనుచున్నారు? ఇది సంవత్సరముల క్రమముగా హెచ్చుచున్నదా? తగ్గుచున్నదా? ఇందులకుఁ బ్రధానకారణము లేవి?

(8) పరిషత్తును ఏమండలగ్రంథాలయముతోనో కేంద్రగ్రంథాలయముతోనో కలిపి వ్యయములు తగ్గించి నివేదికలు ప్రచురించుటతో తృప్తినొందుట మంచిదా? ఇప్పటివలెనే ప్రజాధనములతో సాగించుట మంచిదా? ఇందేది ప్రజోపయోగము?

(9) పరిషదధ్యక్షులు పరిత్కార్యనిర్వాహకులు ప్రతిసంవత్సర మెన్నెన్ని సమావేశములు జరుపుచున్నారు? పరిషత్సమావేశములందు వార్షికోత్సవములందు ఎంతెంత మొత్తములు వ్యయము చేయఁబడుచున్నది? కొందఱు పండితులకు మాత్రమే వ్యయము లేల యిచ్చుచున్నారు? ఆకొందఱిని నిర్ణయించున దెవరు?

ది—అట్టట్టె—చిలవలకు పలవలు—పలవలకు చిలవలు నై తుదకట్టు మాఱినది. ఆసాయంకాలముననే—అది యొక నవలయో—నాటకమో— గద్యకావ్యమో—ప్రహసనమో—భావగీతమో—యేదియో యై పోయినది. ఇంక నేను దీనికినామకరణముజరిపి—యేదియైన నొక పత్త్రికకుఁ బంపి ప్రకటించుటయే తరువాయి. అది యీవారములోనే జరుగును. ఈవేళ యేమి వారము? ఏమి—వారము? ఏమి—వారము?

పుట్టినవారము. పెరిగినవారము. తినెడువారము. తిరిగెడువారము. చదువు లేని వారము. సంధ్య లేని వారము. పెద్దలమాట విననివారము. పెంకితనము గలవారము. భయము లేనివారము. భక్తి లేనివారము. బుద్ధి లేనివారము. శుద్ధి లేనివారము. తెలివి లేనివారము. తేట లేనివారము. శ్రద్ధ లేనివారము. శక్తి లేనివారము. సిగ్గు లేనివారము. చింత లేనివారము. ఉపాయము లేనివారము. ఊరకుండువారము. ఓపిక లేనివారము. ఓర్వ లేనివారము. కూడు లేనివారము! గుడ్డ లేనివారము!

ఇరుగువారము; పొరుగువారము; పేదవారము; గ్రుడ్డివారము, కుంటివారము, కానివారము. మఱి యెట్టి వారము? సోమరివారము. ప్రతివారము వచ్చువారము. యాయువారము, అడుగువారము. పెట్టిన తీసికొనువారము, పెట్టకపోయిన దిట్టెడువారము. నీతి లేనివారము, నిష్ఠ లేనివారము. గతి లేనివారము, మతి లేనివారము. ఎందుకు వచ్చినవారము? చేవ లేనివారము, లేవ లేనివారము. నల్లవారము అయినను తెల్లవారము అనుకొనువారము. పొదుపు లేనివారము. పూనిక లేనివారము. తెగువ లేనివారము; తెంపు లేనివారము. తొందరపడువారము ముందుకు వచ్చువారము, వెనుకకుఁ బోవువారము. మాదొడ్డవారము! ఎఱిఁగి యెఱుఁగని వారము. తెలిసి తెలియని వారము. చేసి చెప్పని వారము చెప్పి చేయని వారము. వెనుకముందులు చూడనివారము. వెఱ్ఱివేషములు వేసెడువారము. ఒకరు చెప్పిన విననివారము. మనంతట మనకు దోఁచనివారము. భాషాజ్ఞానము లేనివారము, భాషాభివృద్ధి కేడ్చెడువారము. దేశదేశములు తిరిగినవారము; దేశాభిమానము లేనివారము. తప్పు లెన్నువారము, ఒప్పు లేనివారము. ఆస్తి లేనివారము అప్పు చేయువారము. ముప్పు దెచ్చువారము మూలఁ బడెడువారము; ఇంతివారము, అంతవారము, అని చెప్పువారము. పని చేయనివారము. మునుపు అన్నియు నున్నవారము, ఇప్పు డేమియు లేనివార

ము. ఆశపడెడువారము, మోసపోవువారము. ఇరుగుపచ్చ కేడ్చెడువారము, పొరుగుపచ్చకుఁ బొక్కెడువారము. చింత చచ్చిన పులుపు చావనివారము. వయసుపోయిన వాంఛ పోవనివారము. ఎవరికి వారే యైన వారము. ఎప్పటి కైనను కలవనివారము. ఎదుగు బొదుగు లేనివారము; ఎప్పటి కిట్లే యుండువారము. పొట్టివారము; పొడుగువారము; ముసలివారము, పడుచువారము.

ఇట్టి వారము, అట్టివారము, అని యేమను వారము? అన్నియు మనమే అయ్యెడువారము; అంతమున అందఱు నొకటే అయ్యెడువారము!

వికటకవి

---

# తెలుగు శాస్త్రుల్లుగారు

(చింతా దీక్షితులుగారు సాహితీసమితి)

## ౧

[శాస్త్రుల్లుగారి యిల్లు. నడవలో తాటాకు చాపమీద శాస్త్రుల్లుగారు కూర్చున్నారు. పక్కను ఆయన కుమారుడు పలక చేత్తో పట్టుకు కూర్చున్నాడు. ఇంట్లో శాస్త్రుల్లుగారి భార్య వంట చేస్తోంది]

కుమారుడు—నాన్నా, మరీ,

శాస్త్రుల్లుగారు—ఎన్నిమాఱులు నీకుం జెప్పవలయును. 'నాన్నా' యన కూడదు. 'నాయనా' యనవలయును. మఱియుఁ 'మరీ' యన రాదు. మఱియు ననవలయును. తెలిసినదా.

కు—తెలిసింది గాని నాయనా, నాకు కాగుణింతం వచ్చేసింది. కావలిస్తే అప్పజెప్తాను.

శా—ఓరీ, నీవు మాటలాడునదంతయు గ్రామ్యము. నీ వటుల మాటలాడరా దని జెప్పితినిగదా! మాటిమాటికి నేల యారీతి నుడివెదవు?

కు—అవును గాని నాన్నా కాదు నాయనా, కాగుణితం అప్పజెప్పుకోవూ?

శా—ఎన్నఁడును గ్రామ్యము మాటాడవుగదా.

కు—మాట్లాడను. కాని అమ్మతో నువ్వెందుకు, నేమాట్లాడినట్లే మాట్లాడుతావూ? నువ్వుకూడా అలా మాట్లాడుతూంటే నేనూ అమ్మాకూడా మాట్లాడుతాము గదా

శా—సరియే, నీవు సెప్పు నది బాగుగానే యున్నయది. ఈదినమున మీయమ్మతో గూడ పరిశుద్ధభాషనే మాటలాడెదను. కానిమ్ము. గుణితముం జెప్పుము.

కు—విను నాన్నా చెప్తాను. క; కాకుదీర్ఘమిస్తే కా; కా గుడిస్తే కి; గుళ్ళో దీర్ఘమిస్తే కీ, కా కొమ్మిస్తే కూ—

శా—ఆఁ, ఆఁ, ఆగు మాగుము. ఆరీతిని చెప్పుచుంటి వేల?

కు—మా మేష్టారల్లా చెప్పేరు నాన్నా.

శా—వలదు. ఎంతమాత్రము వలదు. అట్లు చెప్పరాదు.

కు—ఎలాచెప్పా...

శా—ఛీ, సరిగా మాటాడుము.

కు—ఎట్లు చెప్పవలయును తండ్రీ?

శా—బాగు. ఆరీతిగా మాటాడుట నేర్వవలయును. చెప్పవలసిన విధానంబెయ్యది యాలింపుము.

కు—ఊఁ.

శా—క. కకు దీర్ఘ మిచ్చిన కా; కకు గుడి నిచ్చిన కి; గుడిలో దీర్ఘ మిచ్చిన కీ, కకు కొమ్ము నిచ్చిన కు; కొమ్మున దీర్ఘ మిచ్చిన కూ. తెలిసినదా.

కు—ఇది బాగుందికాదు నాన్నా. మాష్టారు చెప్పిందే బాగుందీ.

శా—అట్లనరాదు. నేను చెప్పిన విధంబుగనే నేర్చుకొనుము.

కు—అల్లా చెప్తే మేష్టారు కొడతారు నాన్నా.

శా—మీమేష్టరునకు తెలుపరాదు. నేనింటియొద్ద నీరీతి బోధించితి నని జెప్పుము.

కు—చెప్పినా కొడతారు నాన్నా, బళ్లో అందరూ చెప్పినట్లు చెప్పకపోతేను.

శా—కొట్టిన తరువాత నాతోడం జెప్పుము. పాఠశాలలందు తెలుగుభాష యీరీతిని ధ్వంసము చేయుచున్నారు. నేనొక్కరుండ నేమి సేయగల్గుదు? పరిషత్తువారైన మాపండితుల మొరాలింపరే! దొరతనమువారైన నొక శాసనము నిర్మింపరే? ఏమి సేయుదు? హా! హాతవిధీ!

కు—నాన్నా. బళ్లో మాకు కొత్తకథ చెప్పేరు. ఇప్పుడు చెప్పనా అది?

శా—చెప్పుము.

కు—అనగా అనగా ఒక రాజు. ఆ రాజూ...అదేమిటి చెప్మా మరిచిపోయేను—ఏదో పూరు నాన్నా, ఆపూరు పాలిస్తున్నాడు ట. ఆరాజుకి ఇద్దరు కొడుకులుట. వాళ్ళు ఏంచేశారా—

శా—గ్రామ్యము గ్రామ్యము. ఉచ్చరింపకుము, ఉచ్చరింపకుము.

కు—కాదు నాన్నా వాళ్ళు గ్రామ్యం వెయ్యలేదూ ఒకనాడు......

భార్య—(లోపలినుంచి) ఇదిగో, ఏమండోయి. ఊఁ,

శా—ఛీ, కుంకా. గ్రామ్యము మాటాడెద వెందుకు.

కు—నేనా, నాన్నా,

శా—అవును.

కు—మాష్టారు చెప్పిన కథ చెప్పుతున్నాను నాన్నా. విను మరి కొసాకూను. వాళ్ళు ఒకనాడు ఒక అడవిలోకి వేటకెళ్ళి

భార్య—(లోపలినుంచి) వినపడ్డం లేదూ, ఇదిగో చూడండీ, ఏమండోయి.

కు—ఒక జింకపిల్లని పట్టుకొని.

శా—ఉండరా, మీఅమ్మ పిలుస్తూన్నట్టుంది. అవునే. ఓ నేవు, పిలిచావా?

కు—నాన్నా, నువ్వూ గ్రామ్యం మాట్లాడుతున్నా వేమి?

శా—లేదు లేదు మరచితిని.

భార్య—వంటయింది. మడికట్టుకోవచ్చు.

శా—వచ్చుచుంటిని, వడ్డింపుము. లెమ్ము శాలకాభోజనమునకు రమ్ము.

౨

[శాస్త్రులుగారి వంటిల్లు. పెద్ద పీటమీద శాస్త్రులుగారు కూర్చుని గంధాక్షతలు ఉంచుకుంటున్నారు. ఆయన కుమారుడు పక్కను చిన్న పీటమీద కూర్చున్నాడు. ఆయన భార్య వడ్డిస్తోంది. వడ్డన అయిన తరువాత శాస్త్రులుగారు కుమారుడూ భోజనానికి కూర్చున్నారు. అడ్డగోడదగ్గర ఆయన భార్య నిలబడి కనిపెట్టి చూస్తోంది]

శా—మఱికొంచెము సూపంబును వడ్డింపుము.

భార్య—(విననట్లు నిలుచుండును)

శా—కించిత్సూపము న్గొని తెమ్ము.

భా—ఏమి టంటారూ? పప్పులో వుప్పు సరిపోయిందా?

శా—పప్పున లవణం బతిమాత్రముగ నున్నయది. అయినం గానిమ్ము. కొంచెము తెమ్ము.

భా—ఏమిటో నమ్మా మీభాష నాకు తెలియదూ. కొంచెం పప్పు వడ్డించమంటారా?

శా—అవును.

కు—నాకూ—డా కొంచెం వెయ్యవే అమ్మా.

శా—డింభకా. గ్రామ్యము వచింతువే?

కు—లేదు నాన్నా మరిచిపోయాను.

శా—ఘృతము, ఘృతము.

కు—అమ్మా నాన్నకు నెయ్యటే.

భా—ఇదేమిటో ఈవేళ యీవికారంవచ్చింది. ఆడదాని దగ్గిరా పాండిత్యం అంతాను?

శా—మన పుత్రకుని కొఱకై యిట్లు మాటాడుచుంటిని గ్రహింపజాలవా? కొంతకాల మిట్లాచరించిన వాడు సలక్షణాంధ్రభాష నేర్వగలడు.

భా—ఏమో నమ్మా నాకు తెలియదు. మీచదువులూ మీవేషాలూను: చచ్చి స్వర్గాన్నున్నారు మానాన్నగారు. ఆయన యిలాగ ఎప్పుడూ మాఅమ్మను కాల్చుకు తినలేదూ. ఆయనకు చదువులోటా ఏమిటి? దేశదేశాలుతిరిగి ఓహో అనిపించుకొన్నారు. ఇవేమిటో ఈకొత్తవేషా లన్నీ యీకాలంలో వచ్చి పడ్డాయి గాని.

శా—ఆడుదానవు నీకేమి తెలియును? వడ్డింప నేర్చినవా రాడువారు. ఇతర విషయములు వారి కేల?

భా—అవును గాని, సోమన్నగారి కూతురికి పెళ్ళయిందిట సుమండీ.

శా—కూతునకు పెండ్లయిన దని ఎవ్వరు చెప్పిరి నీకు—ప్రేయసీ.

భా—రేవుదగ్గిర నర్సమ్మ చెప్పింది.

శా—అందేమి విశేష మున్నది ప్రాణప్రియా?

భా—ఊరుకోండి, ఎవరేనా వింటే నవ్వుతా రనేనా, లేదు కాబోలు.

శా—ఏల, ఏల?

భా—ఏమిటి మరీ? నాటకాల్లోలాగ నన్నలా పిలుస్తా రేమిటి? ప్రేయసిట, మన్నుట మశానంట.

కు—అమ్మా చారే.

శా—ఈనాడు చారు కాచితివా లేదా?

భా—కాచాను. పొయ్యమన్నారా ఏమిటి?

శా—పోయుము.

భా—(నడ్డిమీద ఒక చెయ్యి పెట్టుకొని కొంచెము వంగి పోస్తూండగా ఆయన కాళ్ళమీదకు చారు చిందును)

శా—నీ కేమియు బుద్ధిలేనట్లున్నదే?

భా—నేనేం చేశాను?

శా—ఏమి చేసితివా? కన్నులు లేవు? నీకు నేత్రింబులు శిరంబుపై కరుదెంచినవి.

భా—చాల్లెండి, నేర్చుకున్నా రలాగయితే.

శా—ఛీ, త్వాష్ట్రిమా. ఇంకా కారుకూతలు కూస్తావు.

భా—బాగుంది. నేనే మన్నానూ! ఈవేళ లేచినవేళ మంచిది కాదు. ఎవరిమొహం చూశానో కాని. కాస్త చారు చిందితే యింత కోపం...

శా—కోపం కోపం అంటావు. చూడు ఏంచేస్తానో? బొత్తిగా అడుపాజ్ఞలు లేకుండా సంచరిస్తున్నావు. ఈవేళ నేనయింది. రేపొద్దున్న ఎవరేనా పెద్దమనిషి వచ్చాడనుకో. ఇల్లా చేసేదానివేనా?

కు—నాన్నా, గ్రామ్యం మాట్లాడుతున్నావేం?

శా—ఛా కుర్రకుంకా నోరుముయ్.

బొడ్డూడని నిర్భాగ్యుడవు. నువ్వా నాకు చెప్పడమే

భా—(ఏడుస్తూ). కుర్రదాన్ననుకున్నారా గుంటదాన్ననుకున్నారా నన్నాలా తిడతారు? ఇంతకీ నేనేం చేశానని? అక్కడికీ ఎంతో భయభక్తులతో చేస్తూంటే—నాకు మాటదక్క విధం లేందే. ఇంతకీ నేను నోచిన నోములు యిలా వున్నాయి. మానాన్నముండాకొడుకు యిలా చేశాడు. నేనూ——

శా—నోరు మూస్తావా ముయ్యవా? వాగుడు మహా ఎక్కువవుతోంది.

భా—వాగుడికి నే నేమేనా శాస్త్రాలు చదివేనా. చదువులు చదివేనా.? ఇక్కడికే వుండరాంవులు లేకుండా వున్నాయి. ఇంకా నాకు చదువులూ చట్టుబండలూ కూడాను. చీకటుండగా లేచి, లేచింది మొదలుకొని వంచిన నడుం ఎత్తకుండా అరవచాకిరీ అంతా చేస్తున్నానని మెప్పా మెహర్భాణీఆ ? ఎంతచేసినా నాచీవాట్లు నాకు తప్పవుగదా.

శా—ఒళ్ళూ పయీ తెలిసి సంచరిస్తే నిన్నెవరూ ఏమీ అనరూ.

భా—ఎవళ్ళూ ఎందుకనాలి నన్ను? నే నేమేనా ఒక దొంగతనం చేశాననా ఒక కాని పని చేశాననా? నాఖర్మాన్నినే బదుకుతూంటే ఒకళ్ళ జోలీ శొంఠీ లేకుండా నన్ను ముట్టుకోకు నామాలికాకి అని తిరుగుతున్నా నామీదపడి ఏడిసీవాళ్ళే ప్రతీవాళ్ళూను.

శా—అంతకంతకీ మితిమీరుతూందే?

భా—ఏమి టీ అదమాయింపు అస్తమానమూను? అవును నాదే తప్పు. మొదటినుంచీ నాతో వేళాకోళం చెయ్యడమెందుకూ మీరు?

శా—నేనేం వేళాకోళం చేశాను?

భా—ఆదిక్కుమాలిన భాషతో నాతో మాట్లాడేరు కాదూ?

శా—నీకు తెలియకపోతే నేర్చుకోవాలి. భాషను తిడతా వెందుకు?

భా—ఇంక, అదోహంటి తరవాయి. ఈసౌడభ్యానికి సాయం.

శా—ఊం. మజ్జిగ పోయుము.

భా—ఏమో నాకు తెలియదు. మీరే పోసుకోండి. ఆపీట దగ్గిరే పెట్టేను. మొదట నన్నన్నడమూను, తరవాత సద్దుకోవడమూను. ఎప్పుడూ వున్నదే!

శా—స్త్రీలు మృగప్రాయులు గదా. నీకును గావలయునా మజ్జిగ.

కు—కావలయును తండ్రీ.

శా—కొనుము పుత్రకా.

## 3

[బడి. పిల్లలంతా బల్లలమీద కూర్చుని వ్యాసాలు వ్రాస్తున్నారు. తెలుగుశాస్త్రుల్లుగారు కుర్చీమీద కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు. ఒక అరగంట అయిన తరువాత శాస్త్రుల్లుగారు కళ్ళు తెరిచి

చూచి, కళ్ళు నులుముకొని కుర్చీలో ఠీవిగా కూర్చుని]

శా—రాశార్రా అందరూ వ్యాసాలూ?

పిల్లలు—రాశామండి.

శా—అవధానులుగారి అబ్బాయీ, యిలారా; నీవు వ్రాసింది చూపించు.

అవ—చదవనాండీ?

శా—చదువు. నేను కునికిపాట్లు పడుతూంటే హెడ్మాస్టరుగానే చూడలేదుగదా.

అవ—లేదండి. వస్తే మేము చెప్పమూ?

శా—ఊఁ. సరే. చదువు.

అవ—"ఒకవూరిలో ఒక పిల్లవాడు వుండెను. అతనికి చిన్నప్పుడే తల్లీ తండ్రీ కాలము చేసిరి. మేనమామగారి యింటివద్ద చదువుకుంటూ వుండేవాడు. తిరిగీ కాలూ తిట్టే నోరూ ఊరుకోనదు అన్నట్లుగా ఇతడు బళ్లోకి వెళ్ళడం మాని తోటలవెంబడి తిరిగేవాడు. పొద్దెక్కడంతోనే యింటికి వచ్చికూడా తెచ్చిన పువ్వు లన్నీ దండలకింద గుచ్చేవాడు"—

శా—ఆగు, ఆగు. ఏమిట్రా అబ్బాయీ నువ్వు కూడా యిలా తగలబెట్టేవు?

అ—ఏమండీ.

శా—వ్యాసం రాయమంటే గ్రామ్యం తగలేస్తారురా?

అ—ఎల్లా రాయాలండి?

శా—ఏది. చూడనియ్యి. చూడు నీభాష గంభీరంగా వుండాలి. అంటే తెలుగుమాటలు వెయ్యవలసినచోట సాధ్యమైనంతమట్టుకు సంస్కృతపదాలే వేస్తూ వుండు. వూరిలో అనే బదులు గ్రామంబున, అంటె ఎంత బాగుంది? పిల్లవాడు అనే బదులు 'బాలుండు' అంటే ఎంత బాగుంది? తెలిసిందీ?

అ—తెలిసిందండి. ఇంకా ఏమేనా తప్పు లున్నాయేమో చెప్పరూ?

శా—ఆఁ. చెప్తా. వింటున్నార్రా అందరూనూ? 'పువ్వులు గుచ్చడం' అనకూడదు. "పువ్వులు గ్రువ్వుట" అనవలెను. 'బళ్లోకి' అనకూడదు. 'పాఠశాలలోనికి' అనవలెను. కి, కు లకు వెనుక ద్రుతము వుంటుందని మరవకండి. సరే వెళ్ళు. మళ్ళీ రాసి చూపించు.

అ—అలాగేనండి.

శా—ఇంకో కుర్రాడు—ఒరే వెంకన్నా—నీ వ్యాసం చూపించు.

వెం—ఇదిగోనండి.

శా—సరే...ఇదేమిట్రా? ఇది చదువు.

వెం—శబ్దశ్రేణి కీతండు దుర్మార్గుండనియే యూహించుచుము.

శా—అంటే ఏమిటి?

వెం—మాటవరసకి ఇతఁడు దుర్మార్గుఁ డనుకుందాము.

శా—ఊహూఁ; ఊహూఁ; సరే. కానీ. చూద్దాం...ఏదీ తరవాత?...ఇదేమిట్రా? చదువు.

వెం—"మీరునకును, రాజుగారునకును ఏమైన పరిచయం బున్నచో వచింపుడు"

శా—"మీరునకును" ఏమిట్రా?

వెం—మీకును అన్నమాటండి.

శా—ఛీ, తప్పు. మీకును అనే రాయి. సరే. రాజుగారునకును అన్నా వేమి?

వెం—రాజుగారికి అనమన్నారా?

శా—ఊఁ, ఊఁ; రాజుగారికి,...రాజుగారినికి;—రాజుగారునకు...పోనీ లే. సరే వెళ్ళు తప్పులు దిద్దుకు మళ్ళీ రాయి.

వెం—చిత్తం.

అ—నేను మళ్ళీ రాసుకువచ్చేను. చదవనాండి?

శా—చదువు.

అ—ఒక గ్రామంబున నొక బాలుం డుండెను. అతనికి బాల్యంబుననే తల్లీ జనకుండును...

శా—జననీజనకులు అని రాయి.

అ—జననీజనకులు కాలం బొనరించిరి.

శా—'కాలం బొనరించిరి' అంటు ?

అ—చచ్చిపోయే రండి.

శా—ఓహో కాలం చేశారా? సరిసరి

అ—మేనమామ గృహంబు నొద్ద చదువుకుంటూ యుండువాఁడు.

శా—చదువుచు, లేదా, పఠించుచు అని రాయి. తరువాత చదువు.

అ—చరించుపాదంబును చూపించు వదనగహ్వరంబును గ్రామంబుకోన దన్నట్లుగా నీతండు...

శా—ఆఁ ఆగు, ఆగు, గ్రామంబుకోన దేమిటి ?

అ—ఊరుకోనదు అన్నమాటండి. తిరిగే కాలు తిట్టే నోరు ఊరుకోనదు. వ్యాసాల్లో సామెతలు రాయమన్నారు కారండీ.

శా—సరే, సరే, గ్రామంబుకోనదు అని రాయకు ఊరకోనదు అని రాయి. లేకపోతే... లేకపోతే... మూకీభావము వహింపదు. అని వ్రాస్తే?

అ—అల్లాగే రాస్తానండి. తరువాత వినండి...“నీతండు పాఠశాలకుం బోవుట మాని వనంబుల వెంబడి చరించీవాఁడు”

శా—చరించువాఁడు అని దిద్దుకో.

అ—ప్రొద్దారోహించుటతోడనే గృహంబునకు...

శా—అంటే ?

అ—ప్రొద్దెక్కడంతోనే...

శా—ఆఁ హాఁ. సరి, సరి;

అ—ప్రిద్దారోహించుటత్తోడనే గృహంబునకు వవ్వి కూడా తెవ్విన పువ్వులన్నియు దండలక్రింద గ్రువ్వ్వాడు...

శా—అదేమిటిరా అర్థం కావడం లేదూ.

అ—గుచ్చు బదులు 'గ్రువ్వ' అని రాయిమన్నారు కాదండీ

శా—అంటే ?

అ—వచ్చి, తెచ్చి అనడానికి వవ్వి, తెవ్వి అన్నాను.

[పిల్లలంతా ఖైమయిందని గోలచేతురు. శాస్త్రులుగారు తొందరతొందరగా యింకో క్లాసులోనికి వెళ్ళిపోవుదురు.]

సమాప్తము.

(ఇందులో పాత్రలు ఎవరినీ వుద్దేశించి వ్రాసినవి కావు)

---

# వాగ్భటుని ఆరోగ్యవిధులు

## వ్యాయామము

శరీరమునకు ఆయాసము గలిగించు పని వ్యాయామ మనఁబడును. దీనినే కసరత్తు అని చెప్పెదరు. పరుగెత్తుట, ఈదుట, దండెములు తీయుట, ముద్గరాదులు త్రిప్పుట, మున్నగు పనులవలన ఆయాసము కలుగును. ఈవ్యాయామము వలన అయిదు ప్రయోజనములు కలుగును.

౧. లాఘవము. అనఁగా ఒడలు తేలిక యగుట. దీనివలన అలసభావము పోయి చురుకుతనము గలుగును. ఏపనియైనను చేయుటకు ఉత్సాహమును, తన్మూలమున ధైర్యమును గలుగును.

౨. కర్మసామర్థ్యము. అనఁగా ఏ పనియైనను చేయుటలో చాతుర్యము కలుగును. సులభముగను, చురుకుగను పని పూర్తి చేయు ఓర్పు కలుగును. విసుగు పుట్టదు.

౩. అగ్నిదీపనము. అనఁగా ఆకలి కరకరలాడును. తిన్నపదార్థములు చక్కఁగ జీర్ణమగుటవలన అగ్నిదీపము కలుగును. వ్యాయామమువలన జీర్ణశక్తి వృద్ధియగును. అగ్నిదీప్తివలన అరుచిపోవును. ఉత్సాహముగూడ పెరుగును.

౪. మేదోక్షయము. అనఁగా క్రొవ్వు కరఁగిపోవును. శరీరమున మితము తప్పిన క్రొవ్వు పెరుగుటవలన స్థూలమౌలి

కండ్డితనము గలుగును. శరీరము ఊరిపోయి నడుచుటకు గూడ శక్తి యుండదు. క్రొవ్వు కరఁగిపోవుటవలన శరరము చక్కని స్థితిలో నుండును.

౫. విభక్తఘనగాత్రత్వము. అనఁగా శరీరమున ఎక్కడనుండవలసిన పుష్టి అక్కడ నుండుట. ఇట్లుండుటవలన దేహమునకు మంచి దార్ఢ్యము కలుగును. దార్ఢ్యము లేని దే పని చేయుటకును వీలు కలుగదు.

ఈయైదు ప్రయోజనములును మనుష్యుఁడు చిరకాలము జీవించియుండుటకును, బ్రతికియున్నంతకాలమును ఏచింతలును, ఏవ్యాధులును లేకుండ సుఖముగ నుండుటకును, ఆనందమయుఁడై యుండుటకునుమూలాధారములు అయియున్నవి.

దీనివలన ఈవ్యాయామము పురుషులందఱును అవశ్యము చేయఁదగినదని తేలుచున్నది.

అయితే యిది సామాన్యవిధి. ఈ సామాన్యనిరూపణమువలన దీనిని మానఁదగినవారు కొందఱు కల రని వ్యక్తమగుచున్నది. వా రెవరన? ౧. వాతవ్యాధులు గలవారు. ౨. పిత్తరోగులు. ౩. పదునాఱేండ్లు నిండని బాలురు. ౪. డెబ్బదియేండ్లు దాటిన వృద్ధులు. ౫. ఏవయస్సులో నున్నను అజీర్ణమువలన బాధపడువారు. వీరు వ్యాయామము చేయగూడదు.

ఈవ్యాయామము చేయునపుడు అర్ధశక్తిమాత్రమే ఉపయోగింపవలయును. అర్ధశక్తి యనఁగా నుదుట, ముక్కుమీఁద, శరీరసంధులయందుఁ చంకలయందు చెమ్మట కలుగునంతకు నన్నమాట. అర్ధశక్తిమాత్రముగ నైన బలవంతులును, చమురుగల పదార్థములను భుజించువారును చేయవలయును.

శీతకాలమున అనగా హేమంత శిశిరఋతువులయందును, వసంతఋతువునందును తప్ప తక్కిన ఋతువులలో ఈవ్యాయామమును అర్ధశక్తికంటెను తక్కువగా చేయవలయును. వ్యాయామము ముగించిన వెంటనే సుఖము తప్పకుండునంతగా శరరమును పట్టించుకొన (మర్దించుకొన) వలయును.

ఇందులకు వ్యతిరేకముగా- అనఁగా ఈవ్యాయామము నధికముగా చేసినచో దప్పి, క్షయ, ప్రతమకము, రక్తపిత్తము, శ్రమ, గ్లాని, దగ్గు, జ్వరము, వాంతులు కలుగును.

ఈవ్యాయామ మొక్కటియే గాదు. ఇట్లే నిద్ర మేల్కొనియుండుట, నడుచుట, స్త్రీసంగమము, నవ్వుట, మాట్లాడుట- వీని నధికముగా చేసినచో మిక్కిలి చెఱుపు కలుగును. చెఱుపు అనఁగా మరణమే గలుగును.

# నీతి గీత

[సత్యవోలు అప్పారావుగారు]

ఆదిమధ్యాంతముల సర్వమరసి చూడ
సజ్జనుని మైత్రి యెల్లెడ సమమె సుమ్ము
విఱిచినను గాల్చినను వేఱువిధము నైన
స్వర్ణమున వన్నె యిసుమంత జాఱిపోదు

తనకు నాశంబు గలిగెడు తఱిని నైన
సజ్జనుఁడు మేలు సేయంగ సంభ్రమించు
తన్ను నఱకంగ మంచిగంధంపుచెట్టు
పరిమళం బిచ్చు నెంతయుఁ బరశువునకు

పూజ్యు లగువారు బుధులను పూజసేతు
రనవరతమును దుర్జను లడఁగు చంద్రు
శివుఁడు పూజింపఁడే, మున్ను శిరమునందు
చంద్రు ధరియించి రాహువు చంపఁగాఁడె

ఆపదలయందు బుధజను లధికధైర్య
యుతు లగుచునుందు రెప్పుడు మతిగలగక
అగరు మండుచు నుండిన యపుడె తనను
గంధమును లోకవిదితంబు గా నొనర్చు

దోషములు సజ్జనుని నోట దొడ్డవి యగు
గుణముఁ బల్కిన దోషమౌ కుమతి నోట
క్షారముల నాని తియ్యని నీరు నిచ్చు
వారిదము; పాము విషమిచ్చు క్షీరమాని

సత్పురుషుమైత్రి దుష్టుఁడు సాధు వగును
దుష్టుమైత్రి సత్పురుషుండు దోషి గాఁడు
పుష్పములనంటి కొనుమన్ను పొందుఁదావి
మంటివాసన పువ్వుల నంటికొనదు

నదులు త్రాగవు తమలోని యుదకములను
కుజము తన పండులను దాను గుడువఁబోదు
వారిదము తాను పెంచిన పైరు గొనదు
పరుల కుపకార మగును సత్పురుషుకలిమి

ఘనుల కొకనాఁడు సంపద గలుగవచ్చు
నాపదలును సంభవ మగు నట్లె జగతి
చంద్రునకు వృద్ధియు క్షయంబు సంక్రమించు
గాని నక్షత్రసమితికి గలుగఁబోదు

దుష్టుఁ డెప్పుడు పెరవారిదోష మెన్ను
సజ్జనుండు గుణం బన్న సంభ్రమించు
నీఁగ పుండ్లను వెదకెడు నెల్లవేళ
షట్పదము గ్రోలు పూవులసౌరభంబు

ధర్మముల నుపదేశింపఁ దగుదు రంద
ఱాచరింపంగ నెవ్వని కలవి గాదు
సజ్జనుఁడు ధర్మకార్యంబు సలుపుగాని
మఱచు కుక్కలగతి బల్కఁ డనవరతము

చెండివైచిన వృక్షంబు చివురు దాల్చు
చందురుఁడు వృద్ధిఁ బొందును సన్నగిల్లి
ఆపదలవేళ గురుమతు లాత్మలోనఁ
గలఁతవాఱక యభివృద్ధిఁ గాంచ నెంత్రు

సజ్జనుఁడు దుర్జనునినైన సరసఁ జేర్చి
సర్వవిధముల గాపాడు సంభ్రమమున
దర్పమున మండిపడుచుండు సర్పములఁ
దాల్చి రక్షించు నెప్పుడు చందనకుజంబు

# వినోదములు

[రేకపల్లి విశ్వనాథము గారు]

రోగి—వారంరోజులనుంచి యిస్తున్నారు మందు. కొంచె మేనా తగ్గింది కాదేమండీ జ్వరం ?

వైద్యుడు—టైఫాయిడుజ్వర మండీ యిదీ. యిరవై యొక్క రోజుల్లోపల చచ్చినా తగ్గదూ.

అతడు—ఈలాంతరు నాదండీ. వెలిగిస్తే వెలుతురు వచ్చేది.
ఇతడు—ఇది నాదేనండయ్యా. ఆర్పేస్తే చీకటి అయ్యేది.
తగవరి—వకరు పగలూ, వకరు రాత్రీ వాడుకోం డయ్యా.

రోగి—కడుపులో బల్ల పెరిగిం దండీ. ఏంచెయ్య మంటారూ ?
డాక్టరు—రంపం మింగండి.

రామన్న—ప్రళయం వస్తే కాఫీహోటల్సుకూడా పోతాయా ?
భీమన్న—అవి పోవు; గాని బాకీలుమాత్రం పోతాయి.

ప్రవాసి—తల్లో పేలు మహాపట్టేయండీ. ఉపాయం చెబుదురూ.
వైద్యుడు—గొరిగించెయ్యవయ్యా.
ప్రవాసి— మా ఆడాళ్ళకండీ.

సూరయ్యా— ఈపిల్లాడు మీ కొడుకే?
సుబ్బయ్యా—నా భార్యా కొడుకండీ.

కుఱ్ఱవాడు—రాత్రి సూర్యుడు కనపడ్డేమండీ ?
ఉపాధ్యాయుడు—చీకటిగా వుంటుంది కనకా.

ఆటకాడు—ఇస్పేటుజాకీ పోడీ, అరఖుమ నెలాఆసుమదాములూ వచ్చేయి. యేం చెయ్య మంటావోయి !

మద్దతుకాడు—ఇరఖు తురఫు చెప్పవోయి.

బాలుడు—పక్కమార్కే కాదండీ తక్కువయింది? కటాక్షించి నాలుగో క్లాసులో వేయండీ చూస్తారూ?

ఉపాధ్యాయుడు—వల్లకాదు. ఈయేడుకూడా మూడో క్లాసులోనే వుండాలి నువ్వు.

బాలుడు—పోనీ మీరుదున్న రక్లాసులోనేనా వెయ్యండీ.

భర్య—వకమాటు కాకినాడ వెళ్ళి వస్తురూ చాలారోజులనుంచి మావాళ్ళ కబుర్లు తెలవకుండా వున్నాయి.

భర్త—ఈమాత్రిందానికోసం రెండురూపాయల రైలుఖర్చెందుకూ అర్ధణాబిళ్ళ అంటిస్తే కార్డు వెడుతూ వుంటేనూ?

భార్య—ఆఅర్ధణాబిళ్ళ మీరే అంటించుకోండి పోనీ.

---

# సీతాప్రవాసము

[కాళ్ళూరి వేంకటరామారావుగారు]

"జాహ్నవీశీతలామలజలకణములు
దాల్చి మలయానిలము స్వాగతమ్మొసంగె;
పావనానందదములు తపోవనములు
కనుల పండువు సల్పుచు గానవచ్చె;
కలుషహారిణి యైన గంగాస్రవంతి
నుఱులఁ గాంచెడి భాగ్యమ్ము దొరికె నాకు
సౌమ్యగుణసాంద్రుఁ డగు రామచంద్రు [కరుణ"
అనుచు సంతస మందు సీతమ్మఁ గాంచి
"జనవిభుని యాజ్ఞ నెఱిఁగని సాధుశీల
నిందుకోరిక చెలువొందుచుండు తల్లి,
బ్రతుకగల్గునె యీ ఘోరవార్త వినిన"
అని పొగులుచుండె లక్ష్మణుఁ; డతనిఁ [గాంచి
మనము బెగడొంద ననియె నా జనకతనయ
"మఱఁది దుఃఖాన యీరీతి మఱుగు టేల?
చేరినది పూతజాహ్నవీతీరభూమి,
అరయఁ జనునవి పరమమున్యాశ్రమములు
ఇట విషాదమ్మునకు హేతు వేమి కలదు?
తలకు మిగిలిన ఆపదల్ గలిగియున్న

ధృతిచెడుఁగనివాఁడ; నీస్థితిని నిన్ను
బాడఁగనిన గుండె నీరయిపోయెఁ దండ్రి;
తిరిగిపోదమె గృహమార్గసరణి'' ననిన
వదినెఁ దోడ్కొని గంగయావలికి దాఁటి,
అన్న యానతి దెలుప నోరాడకునికి
గనుల నీర్నించి వగచు లక్ష్మణునితోడ
సీత లోకైకమాత వచించె మఱల
"తండ్రి! సుగుణాల కుప్ప, వేతప్పు చేసి
ఘోరశోకాన నీరీతిఁ గుందుచుంటి?
చారుతరమూర్తి శ్రీరామచంద్రమూర్తి
సేమమేకద? బంధువుల్ క్షేమయుతులె?
అన్న మన్నన దప్పి నిన్నాడె నేమొ?
కాకదయమాలిన స్నీడఁ గడఁగెనొక్కొ
హృదయ మలజడిఁ బడె ప్రాణ మదిరి [పోయె
ఏది కారణమో చెప్పరాదె మఱఁది?"
"ఇంక తప్పించుకొనుటకు నేమి మార్గ"
మనుచు దృఢనిశ్చయత నిట్టులనియె. [నతఁడు
"జనని దుష్టులు తుచ్ఛరావణుని యింట
చాల కాల ముండిన సీత నేలుచుండె
రాముఁ" డని పల్కినట్టి నీలాపనింద
పడుట కోర్వక నిన్ వనిన్ వదలు మనుచు
నాజ్ఞయిడె నన్న, యేమందు నమ్మ నేను
కలితకనకంపు మందిరాంగణము లందు
లీల చరియించు తల్లి నీ కేల కలిగె
కారుటడవులలోన సంచార మిపుడు?
వేలు, వందలు చెలులు దాసీలుగాగ
నూడిగము గొను తల్లి నీవొంటి నిపుడు
దిక్కుమాలిన పక్షివై తిరిగెదమ్మ.
అఖిలలోకాభిరాము పట్టాభిరాము
సరస మన్నలను గను సన్నుతాంగి
ఏమి పాపఫలమ్మొ నీకిట్టి దశకు?
కనకమయమ్మృదు వస్త్రమ్ములను ధరించు
సీత సుకుమారవతి! నారచీర లెట్లు
కట్టి వేగించెదో యిట్టి కష్టదశను?
ప్రాణవిభు పొంత ప్రియ మెలర్పంగ [సతము
మించు పరమాన్నముల నారగించు సాధ్వి
కందదుంపలతో నెట్లు గడపుదమ్మ?
అడవి నిడ్విడు కఠినాత్ముఁడను నాదు
పాపమున కేది మేర యేర్పడఁగఁబోదు''
ఇటుల పలికెడి మఱఁది నోకింత సేపు
నమ్మఁజాల కబద్ధమెన్నడును పలికి
యెఱుఁగని విశుద్ధచరితున కతని కనియె.
"ఏల సౌమిత్రి యీదీనురాలి కొఱకు
కండ్ల నీర్నిండ దుఃఖాన కలఁగె దిట్లు
ధరణి కష్టాలకై పుట్టు ధరణిసుతకు
సౌఖ్య మిఁక రాదు రాదు నిశ్చయము [రాదు
కొలఁది నోములు నోచి నేగొప్ప ఫలము
కలుగవలె నని కోరిన ఫలము గలదె?
తొలుత నేజంట నెడబాపి కులికినానొ
ప్రాణపతి పాదముల నెడఁబాయవలసె,
మహితసౌందర్య శోభాసమన్వితమ్ము
రామముఖచంద్రు దివ్యదర్శనము నాకు

సరియె కాబోలు నింక నీ జన్మమునకు.
లక్ష్మణా యింక నేలజాలమ్ము సేయు
త్వరితగతి నేగి నీదు సోదరునిఁ గాంచి
ముందు నామాఱుగా నీవు మ్రొక్కి వనుల
నింద తను జెందనీయక నేను తనదు
నాజ్ఞ తల దాల్చి చరియింతు ననివచింపు''
అనిన వదినెకు తా ప్రదక్షిణ మొనర్చి
అతివిచారముతో నమస్కృతులు చేసి
తాపసీంద్రుల, పంచభూతములఁ దలచి
జనకసుతఁ గావుఁ డనుచు ప్రార్థనలు సలిపి
పదము తొట్రిల, కంట బాష్పములు రాల
తరుచు వెనుకకుఁ దిరిగి దా నరసికొనుచు
జాహ్నవీనది దాఁటి లక్ష్మణుఁడు చనియె
కలికి సౌమిత్రి చనెడి మార్గమునఁ జూచె
ఘనరథమ్మును తొలుత; కేతనము పిదప
అంత రథపరాగ మ్మొక కొంతసేపు-
పదపడి మరల్చికొని వట్టి బయటి చూపు
తన యవస్థకు వగపుసంద్రమున మునిఁగి,
"రాజఋషియైన జనకు గర్భమును బుట్టి
అతికృపాళుఁడు రాము నర్ధాంగి నగుచు
పూర్ణగర్భిణినై, యిట్లు పొగులవలసె;
ఇచటి తాపసకామినులెవ్వ రేని
ఏను వని నుండుటకు హేతు వేమి యనిన
ఏమి చెప్పెడి దాన? ఇంకేది దిక్కు''
జ్ఞానధనుఁ డగు వాల్మీకిమౌళి యపుడు
రమణి తెఱఁగును సకలకారణమును తె
[ఱిఁగి
జానకీదేవిఁ గొనుచు నిజాశ్రమమును
చేర్చి మునికాంతలకు నప్పజెప్పెనంత.''

---

# పెద్దలు చెప్పిన కథలు

పూర్వ మొకరాజు ప్రజలను కన్న బిడ్డలనువలె కాపాడుచుండెను. ఇతర రాజులవలె నతనికి రాజ్యమును పెంపుచేసికొనవలయు నను ఉత్కంఠ గాని, ఐహికసౌఖ్యలోలత గాని, అధికారగర్వము గాని లేదు. ఆతని కొక్క కూతురు. కొడుకులు లేరు. కేవలము ఒక్క కూతురు.

ఆమె చక్కని చుక్క. రతి యని చెప్పవచ్చును. ఆమె వన్నియు సుగుణములే. ఇందులకు తగినట్లు తండ్రి ఆమెకు వరణాధికారమును పూర్తిగ నిచ్చివేసెను. "మంచిచెడ్డలను పరిశీలించుటలో నీనేర్పు సామాన్యమైనది గాదు. ఈవిషయమున నీకు పొరపాటు కలుగదు. మేము నీసుఖమునకు విఘాతము కలిగింపము; గాని మేము కోరు మంచి సంపత్తు

నీకు తృప్తిని కలిగింపకపోవచ్చును. ఇదివఱకే నీవు పతినిర్ణయము చేసికొంటివేమో తెలియదు మాట లేల? నీకెవఁడు నచ్చునో వానినే పెండ్లి చేసెదను" అని యాతఁడు కొమార్తతో చెప్పెను.

రాజకన్య తండ్రికి కృతజ్ఞత తెలిపి వరాన్వేషణమునఁ బ్రవృత్తురాలైనది. ఆమె సుందరి గావున అతఁడును సుందరుఁడు కావలెను. ఆమె విదుషి కావున అతఁడును విద్వాంసుఁడు కావలెను. ఆమె సుగుణియు, కులీనయుఁ గావున అతఁడును సుగుణఖనియు, కులీనుఁడును కావలెను. ఇన్నిటికిని పైని అన్యోన్యప్రణయము కలుగవలెను. ఇంతయు సమకూరిన గాని పెండ్లి కాదు.

ఆమె తొందరపడలేదు. "మానుషప్రయత్నమున తప్పు లుండఁగూడదు. ఈశ్వరసంకల్పమున కడ్డులేదు" అని యామె నిశ్చయించుకొనియెను.

ఒక విప్రకుమారుఁడు కాశీనగరమున బాల్యమునందే సకలవిద్యలు నభ్యసించి దేశాటనమునకు బయలుదేఱెను. నవయౌవనుఁడు. ఆపైని మదనసుందరుఁడు. సుగుణమణి. కులీనుఁడు. శాంతుఁడు. అతఁడు వెళ్ళినచోట నెల్ల చూచినవారి కందఱకును ప్రీతిపాత్రుఁడగుచుండెను. సంచారక్రమమున అతఁడు ఈపట్టణమునకు వచ్చెను. సత్రములో బస. వచ్చిననాటి సాయంకాలము దేవతాదర్శనార్థ మాతఁడు ఆలయమున కరిగెను. అందఱును ఆతని విలక్షణరూపమును గాంచి ముగ్ధులయిరి.

రాచకన్నెగూడ యథాపూర్వముగ దేవతాదర్శనమునకు వచ్చెను. ఆమెయు నాతని రూపమును మెచ్చుకొనియెను. ఇంతే. ఈశ్వరుని సేవించుకొని ఆమె నగరునకు వెడలిపోయెను.

కాని విప్రకుమారుఁడామెను చూచి చలించెను. "ఈ రాజకన్య నావంటివానికి లభింపదు. అయినను ఈకన్యనే గాని పెండ్లియాడఁగూడదు" ఇట్లాతఁడు నిశ్చయించుకొనియెను. ఇక చేయవలసిన దేమున్నది? ముఖమండపమున ఆతఁడుతపోనిష్ఠుఁడయ్యెను.

ఒక దినము గడచిపోయినది. రెండవ దినమున అర్చకుఁడు దగ్గర కరిగి "నీ వృత్తాంతమేమి? నీకేమి కావలయును?" అని యడిగెను. "నాకేమియు వల"దని విప్రకుమారుఁడు బదులు చెప్పఁగా అర్చకుఁడు రిచ్చవడి వెడలిపోయెను.

మూఁడవనాఁడు మఱికొందఱు వచ్చిరి. నాల్గవనాఁడు ఇంకను వచ్చిరి.

"దేవాలయములో మండపముమీద బాలయోగి యొకఁడు కూర్చున్నాడు. ఎందుకిక్కడకు వచ్చినదియుఁ దెలుపఁడు. ఏమిచ్చినను పుచ్చుకొనఁడు. ఆహారము తినఁడు. నీళ్ళయిన త్రాగునో లేదో" యను మాటలు నగర మంతయుఁ బ్రాకిపోయెను. దేవాలయ మంతయు జనులతోఁ గ్రిక్కిరిసియుండఁ జొచ్చెను.

ఎవ రెన్ని విధముల నడిగినను ఆతఁడు సంగతి చెప్పలేదు. సరిగ మాటలే ఆడలేదు. "ఆ రాజకన్యనే పెండ్లియాడవలెను. లేకున్న ఈమండపముమీఁదనే ప్రాణత్యాగము చేయవలెను" అను వ్రతమును అతఁడుమరింత దృఢపరచికొనియెను.

పట్టణ మంతయు నీతనిని గురించియే చెప్పుకొనుచుండెను. తుదకీవృత్తాంతము రాజు వినియెను. రాచకన్నె చెవిలోఁ గూడ బడియెను.

పౌరుల రాకపోకలకు ఎడ తెరిపియే లేదు. కడకు రాజును కొమార్తెయుఁగూడ బయలుదేరి వచ్చిరి. నమస్కరించుట దీవించుట అయ్యెను. రాజు ప్రస్తావము ప్రారంభింపఁగా విప్రకుమారుఁడు మౌనవ్రతమును విడిచెను. రాజు చాల సంగతు లడుగఁగా నాతఁ డన్నిటికిని ప్రత్యుత్తరము లిచ్చెను. "ఆహారము గొనవేల? నీకేమి కావలయును?" అని రాజు అడుగఁగా "నాకు ఆకలి లేదు. ఏమియు నక్కరలేదు" అని యాతఁడు చెప్పెను. "నీకు సందేహము వలదు. ఏమి కోరినను నేను ఇచ్చెదను. నా రాజ్యమును గోరినను ఇచ్చెదను. నాకొమార్తెను గోరినను ఇచ్చెదను" అని రాజు దృఢనిశ్చయముతోఁ దెలిపెను.

అది విని విప్రకుమారుఁ డొక్క క్షణము నిమీలితనేత్రుఁడై ఈశ్వరుని ప్రార్థించి రాజుతో నిట్లు చెప్పెను.

"రాజా, నీవు యథార్థము తెలిసికొంటివి. నేనిక్కడికి వచ్చిననాఁడే ఈ యాలయమున నీకొమార్తను జూచినాను. వెంటనే మనస్సు ఆమెమీఁద లగ్నమైనది. "పెండ్లి యాడిన ఆమెను పెండ్లియాడవలెను. లేకున్న ఇక్కడనే దేహమును విడువవలయు"నని నిశ్చయము చేసికొంటిని. అనుకొని నంతయు నైనది."

ఇది విని రాజు పరమానందభరితుఁడై తన కొమార్తగూడ అందులకు అంగీకరించియుండుట గ్రహించి "ఇంతకంటె నాకు కోరదగినది లేదు. నాకొమార్త యిదే పరిగ్రహింపు" మనగా విప్రకుమారుఁడు "సంతసించితిని. రాజా! నీయోగ్యతయు, అంతకంటె నీకొమార్త యోగ్యతయు ప్రశంసింపఁదగియున్నవి.

అయితే యొకటి కలదు. నేను కొన్నిది నములుమాత్రమే ఈశ్వరధ్యానము చేసినది. ఈస్వల్పధ్యానమునకే ఈశ్వరుఁ డిట్టి ఫలము నీయనున్నాఁడు ఎల్లప్పుడు నాతనినే ధ్యానించుచుండిన ఇంక నెట్టి గొప్పఫలముల నిచ్చునో కావున నీకో మూర్త నాకు వలదు. ఆమెను నివ్వ కె చ్చినట్లు సంతసించెదను. ఆమె నన్ను గ్రహించినట్లు ఆనందించెదను; కాని నన్ను వెడలిపోనిమ్ము. నాకేమియు వలదు. నాకు ఈశ్వరుఁడే కావలెను" ఇట్లు చెప్పి యువరితోడను యింక నేమియు పలుకక ఆతఁడు ఎటకో వెడలిపోయెను.

---

# వేదాంతము

శ్రీయుత గంగానాథఝా ఎం. ఏ గారు "మనోరమ" అను హిందీపత్రికలో నీరీతి నొక చిన్న వ్యాసమును ప్రకటించిరి.

సుమారు రెండు వేలసంవత్సరములనుండి జనులు వేదాంతము నేర్చుకొనుచున్నారు, నేర్పుచున్నారు. ఈ రెండు నభివృద్ధిచెందినకొలది వేదాంతమును నిజముగా నెఱిగినవారి సంఖ్య తగ్గుచున్నది. వేదాంత మన కేవల మాలోచనకు బుద్ధికిని ఒకరీతి లీలారంగముగ పరిణమించినది. "బ్రహ్మము సత్యము, జగత్తు మిథ్య" అనునది వేదాంతశాస్త్రమునకు మూలమంత్రము. "సత్యము," "మిథ్య" అను పదముల నిర్వచనము సేయ నసంఖ్యాకము లగు గ్రంథములు రచింపబడెను. అజ్ఞానము నశింపజేయుటకు వేదాంతము పుట్టినది కాని ప్రకృతాచరణమున వేదాంతమును అజ్ఞాన మావరించినట్లు కనబడుచున్నది. ఇప్పుడు వేదాంతమునకు మూలసూత్ర మిది—"వేదాంత మన్న నేమియో సరిగా తెలియదు"

శ్రీహర్షునిది బహుసూక్ష్మబుద్ధి. ఆతడు వేదాంతవిషయమున నుద్గ్రంథము వ్రాయుచు "వేదాంత మన నేదియు సరిగా నిర్ణయింపజాల"మని వ్రాసెను. ఈగ్రంథము వ్రాసి రమారమి తొమ్మిది శతాబ్దములు గతించినవి. పిమ్మట "చిత్సుఖి" "అద్వైతసిద్ధి" అను గ్రంథములు రచింపబడెను. ఇవి వేదాంత మన్న సరళముగా బోధించుటకు మాఱు పాఠకుల భ్రమాన్వఱచి, పదవాగురులలో త్రో

సిచిక్కు పెట్టును. కావున "వేదాంతి" అనుపద మవమానసూచకముగ పరిగణింపబడుచున్నది.

పై గ్రంథములను ఆధారము చేసికొని ఏమివ్రాసిన నది నిరుపయోగము వ్యర్థము. వేదాంతమును స్పష్టముగా గ్రహింపవలెనన్న భాష్యములజోలికిని, వ్యాఖ్యానములవంకకును పోక శ్రీశంకరాచార్యులు రచించిన స్తోత్రముల పఠించి మననము చేసికొనిన చాలును. "దక్షిణామూర్తిస్తోత్రము"ను సురేశ్వరాచార్యులవారి 'మానసోల్లాస' వ్యాఖ్యానసహితముగా పఠించినచో, అనేకము లగు నుద్గ్రంథముల తలలోని కెక్కించుకొనిన పండితునికన్న విశదముగా వేదాంతమును గూర్చి యెఱుగవచ్చును. "హరిమీడే" స్తోత్రముకూడ నట్టిదే. జ్ఞానవైరాగ్యములకు మూలము శుద్ధమగు భక్తిమార్గము కోరువారలు "ఆనందలహరి" "సౌందర్యలహరి" కన్న వేఱుగ్రంథముల పఠింపనక్కఱలేదు.

వేదాంత మన్న అభిరుచి కలిగించుటకు ఇవి మాత్రమే చాలును; కాని దానిని సవిస్తరముగ సక్రమముగ పఠింపగోరువారికి "సంక్షేపశారీరక" మను గ్రంథముకన్న మేలుగ్రంథము దొరకదు. వేదాంతసూత్రముల యర్థము గ్రహింపవలె నన్న పైని చెప్పిన స్తోత్రములే శరణ్యము. ఉద్గ్రంథములయందు పూర్వపక్షములు సిద్ధాంతములు విపులముగా నుండవచ్చును, దానివలన గ్రంథకర్తృ బుద్ధి సూక్ష్మతయే గోచరమగు గాని, ఈస్తోత్రములవలె వేదాంతసూత్రముల సారమును సులువుగా తృప్తికరముగా బోధించు గ్రంథములు చిక్కవు.

"వేదాంతి" పత్రికనుండి శ్రీపాద కామేశ్వరరావుగారిచే నాంధ్రీకరింపబడినది.

# నేను

[చిలుకూరి, వీరభద్రరావు గారు]

'నేను' అనునది రెండక్షరములు మాత్రమే గల యొక చిన్న తెనుగుమాట. ఈపదమును గాని, వారివారి భాషలలో ఈయర్థమునే యిచ్చు వేరొక పదమును గాని, ఏదో యొక సందర్భమున ఉపయోగింపనివాడు మాటలాడ నేర్చిన మానవులలో నెక్కడను గానరాడని చెప్పవచ్చును. దీనికి స్త్రీపురుషభేదము లేదు; జాతిమత భేదము లేదు; మఱే యితరభేదమున్ను లేదు. దేహమే యాత్మయని వాదించు లోకాయతికులున్ను, ఆత్మయే లేదని వాదించు బౌద్ధులున్ను, ఏమి వాదించుటకు జేతగాని పామరజనులున్ను 'అహం బ్రహ్మాస్మి' యను బ్రహ్మాత్మైక్యభావమును స్వానుభవమునకు దెచ్చికొన్న తత్త్వజ్ఞానులున్ను, వారు వీరు అననేల, యెల్ల దేశములవారును, ఎల్లకాలములవారును తమతమ వ్యవహారములయందు 'నేను' అను పదమును వాడుచున్నారు.

ఈపదమును వాడుటమాత్రమే కాక, ప్రతిమనుజుడున్ను కొంచము ఆలోచించు నెడల, 'నేను ఉన్నాను' అను సాక్షాత్ప్రతీతిని కూడ కలిగియున్నాడు. ఇది లోకప్రసిద్ధము. సర్వజనానుభూతియగుటచేత, దీనిని భ్రమజనితమని తృణీకరింపదగదు. 'నేను' ఉండుటచేతనే, అనగా సత్యపదార్థమగుటచేతనే, 'నేను' అను భావము మనకు కలుగుచున్నది. "అస్మత్ప్రత్యయవిషయత్వాత్, అపరోక్షత్వాచ్చ ప్రత్యగాత్మప్రసిద్ధిః" (అపరోక్షజ్ఞానమే, 'అహం' పదార్థముయొక్క అస్తిత్వమునకు నిదర్శనము) అని శ్రీశంకరాచార్యులవారు తమ సూత్రభాష్యపీఠికయందును, ఇంక యితరస్థలములందును, వ్యక్తీకరించియున్నారు.

ఇంతేకాక, 'నను' కానట్టి, అనగా సృష్టియందున్న తదితరసకల పదార్థములను గూర్చి కంటె 'నేను' అను దాని విషయమే 'నాకు' బాగుగా దెలియుననుట గూడ ఎంతయు సమంజసముగ నుండును. దొమ్మరివా డెంత నేర్పరి యైనను, తన మూపురముపై దానెక్క లేనట్లుగను, సమస్తమును దహించు నగ్ని తన్ను దా దహింపలేనట్లుగను, సర్వవిషయములను దెలిసికొను 'నేను' (విషయి) నన్ను దెలిసికొనుటయు గూడ యసంగతమే; కాని యింద్రియగోచరము లగు నింద్రియార్థములను దెలిసికొను ప్రకారముగ 'అహం' పదార్థమును 'నేను' తెలిసికొనజాలకపోయినను, 'నేను' అనునది ఉన్నది (అస్తి) యని మాత్రము నేను తెలిసికొన గలుగుటకు ఏవిధమైన అభ్యంతరమున్ను లేదు. "నేను ఈవిషయమును తెలిసికొన్నాను; నేను ఈపనిని చేసినాను" అన్నప్పుడెల్ల

ను, క్రియలకు విషయములగు కర్మల యొక్క సత్యత్వము ఎంత దృఢముగ కన్పించుచున్నదో, కర్త యగు 'నా' యస్తిత్వముగూడ అంత దృఢముగ కన్పించవలెను. కర్త (జ్ఞాత) యగు నాయస్తిత్వము నిజమైన పక్షముననే, కార్యములు (జ్ఞేయములు) అగు విషయప్రపంచము యొక్క ఉనికి సమాధానము కుదురగలదు. మఱియు, తాను ప్రకాశింపజేయుటకు వస్తుజాలము లేకపోయినను తేజోమూర్తి యగు సూర్యుడు ఎటు స్వయంప్రకాశముగ నుండుటకు సాధ్యపడునో, అట్లే 'నేను' తెలిసికొనుటకు ఎట్టి విషయములు లేకపోయినను, 'నేను' స్వయముగ నున్నాను అనుటకు గూడ ఆటంకమెంతమాత్రము నుండదని చెప్పవచ్చును.

తన యస్తిత్వము ప్రతిమనుజునకున్ను, ఎంత దృఢనిశ్చయవిషయమో, ఒక ఆంగ్లభాషాప్రయోగమును బట్టి గూడ మనము గ్రహింపవచ్చును. ఏదైననొక సంగతి పరమసత్యమని చెప్పవలసివచ్చినప్పుడు, "As sure as I am" అని ఆంగ్లేయులు చెప్పుదురు. 'అహ మస్మి' యను సంగతి యెంత నిర్వివాదాంశమో ఈప్రస్తుతవిషయముగూడ అంత నిస్సందేహమైనదే, అని దీని తాత్పర్యము. సత్యవిషయములలో మన యస్తిత్వము ప్రసిద్ధోపమానమునకు రాగలుగునంత శ్రేష్ఠత్వమును గలిగియుండుటను బట్టి, అది యెంత సత్యమైనదో యూహింప నగును.

'నేను' అనునది యింత సత్యమును; సర్వసామాన్యమగు పదియైనను, దానిని గూర్చి విచారణ జేయువారు బహు సకృత్తుగ నున్నారు. సర్వసామాన్యమగుటచేతనే, దీని విచారణ చాలమందికి స్ఫురింపనే స్ఫురింపదు. విచారణకు బురికొల్పునంతటి క్రొత్తవింత యేదియును దీనియందు వారికి గన్పింపదు.

కాని చూపునకు సామాన్యముగ దోచుచున్నను, ఇదియే పొందదగినది (తదేతత్ పదనీయమ్) యని మహావేత్తలు ఘోషించుచున్నారు. యాజ్ఞవల్క్య మహర్షి మైత్రేయికి పరమార్థము నుపదేశించుచు,

''ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయ్యాత్మనో వా అరే దర్శనేన శ్రవణేన మత్యా విజ్ఞానే నేదగ్ం సర్వం విదితం'' ఆత్మ (నేను) పదార్థమునే గురువులవలన వినవలసినది. విన్నదానిని తర్కముచే మననము చేయవలసినది; మననాంతరము నిశ్చయముతో ధ్యానము చేయవలసినది. ఆత్మ (నా) జ్ఞానము మూలముననే, సమస్తము తెలియబడుచు

న్నదిఅని బృహదారణ్యకోపనిషత్తునందు బోధించెను. ఇట్లే గ్రీసు దేశమునందలి తత్త్వజ్ఞానులున్ను, 'Know theyself' (నీ వెవ్వడవో తెలిసికొనుము) అను పరమ పురుషార్థమును శిష్యులకు బోధించెడివారు. 'నేను ఎవ్వడను' అని ప్రతివాడున్ను ప్రశ్నించుకొని యథార్థజ్ఞానమునకు గావలెను. వీని తాత్పర్యము ఏమనగా ఏయేక వస్తువిజ్ఞానముచేత, సర్వవిజ్ఞానము అలవడునో, అదియే నేను.

ఇంత మహాత్మ్యము గల 'నేను' అనునది యేదియో, ఇప్పుడు తెలిసికొనుటకు ప్రయత్నించెదము. నోట వచించునప్పుడు ఏర్పడు ధ్వనివిశేషము (శబ్దము) న్ను, కాగితముపై గాని తాటియాకుపై గాని వ్రాయునప్పుడు ఏర్పడు రూపవిశేషము (అక్షరసముదాయము) న్ను 'నేను' కాదని మొట్టమొదటనే యెఱుగ నగును. ఏమనగా శబ్దరూపములు ఏదో యొక పదార్థమునకు చిహ్నలు Symbols గాని, పదార్థములు గావు.

ఇవి గానిచో, ఇక మరేదియో చూతము. చుట్టుప్రక్కల నున్న స్థావర జంగమాత్మకమును, విజాతీయములును, అగు వస్తుసముదాయముకంటెను, స్వజాతీయ మగు మానవకోటికంటెను భిన్నమై కొంతపరిమాణమున్ను, ఒక విధమగు నాకారమున్ను, మాంసము నెత్తురు, ఎముకలు మొదలగువానితో గూడిన కరచరణాద్యవయవములున్ను కలిగిన యొక తత్త్వము 'నేను' అనుకొనుచున్నాను. ఈతత్త్వము (substance) నకే శరీరము అని పేరు. నాది యనుకొను శరీరమునకు వెలుపల నున్న ఒక వస్తువునకు దెబ్బతగిలినప్పుడు నాకు బాధలేకుండుటయు, నాశరీరము నందలి భాగ మగు చేతికిగాని కాలికిగాని దెబ్బ తగిలినప్పుడు నేను బాధపడుటయు జూడగా, ఈశరీరముతో నాకు అత్యంత సంబంధ మున్నట్లు తోచుచున్నది. కావున నడచుట, చూచుట, ఊహించుట మొదలుగాగల పనులు జరుగునప్పుడు, నేను నడచుచున్నా ననియు నేను చూచుచున్నాననియు, నేను ఊహించుచున్నా ననియు, అనుచున్నాను. ఇన్ని వివిధ క్రియలకు కర్తగా నున్నప్పుడు, 'నేను ఒక్కటియా? వేరువేరా? నడచు కర్మేంద్రియమా ఊహించు మనోబుద్ధులా ఇవి అన్నియు నందుమా?

నిజమునకు 'నేను' అనునది ఇవి ఏవియును గాదు. నాయొక్క కాలు నాయొక్క కన్ను, నాయొక్క మనస్సు అను ప్రయోగములందు, షష్ఠీవిభక్తి ప్రత్యయములుండుటచేత, నేను ఈశరీరేంద్రియములకంటె భిన్నుడ ననియు, వాటికి యజమా

నుడ ననియు, కాలు, కన్ను మొదలగు
నవి నాకు చెందియున్న సాధనము అని
యు, స్పష్ట మగుచున్నది. కావున «శ్రో
త్రస్య శ్రోత్రం మనసో మనో యద్వా
చోహ వాచంస ఉ ప్రాణస్య ప్రాణః"
(ఈశ్రోత్రాదులకు ప్రేరకుడను మాత్రమే నేను) అని కేనోపనిషత్తునందు చెప్ప
బడినది. ఈయింద్రియములు ఏవియు
నేను కానప్పుడు, నేను ఏపనులనుగూడ
చేయుట లేదు. ఈయర్థమే తెటపడున
ట్లుగ, శ్రీకృష్ణభగవానులు అర్జునునకు
భగవద్గీతయందు (III)వ యధ్యాయమున

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మా
ణి సర్వశః అహంకారవిమూఢాత్మా కర్తా
హ మితి మన్యతే. 27

తత్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగ
యోః గుణాగుణేషు వర్తంత ఇతి మత్వా
న సజ్జతే. 28

(నేను చేయుచున్నాను అని మూ
ఢుడు భావించుచున్నాడు. కాని యథా
ర్థమునకు ఇంద్రియములు విషయములం
దు ప్రవర్తించుచున్నవి) అని బోధించి
నాడు.

ఈపై కారణములచేతనే, ఇంద్రి
యములు మొదలగువానియొక్క సంఘా
త మగు శరీరమునుగూడ నేను గానని
వ్యక్త మగుచున్నది. ఈశరీరమునే వే
దాంతులు క్షేత్ర మందురు. భగవద్గీత
యందు క్షేత్ర మిట్లు వర్ణింపబడినది.
(XIII) వ అధ్యాయమున మహాభూతా
న్యహంకారో బుద్ధి రవ్యక్త మేవచ ఇం
ద్రియాణి దశైకం చ పంచ చేంద్రియ
గోచరాః. 6 ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం
సంఘాత శ్చేతనాధృతిః ఏతత్ క్షేత్రం
సమాసేనసవికార ముదాహృతం. 7

ఈవర్ణనకు అనుగుణముగ, మనో
బుద్ధులు ప్రకృతివికారము లనియు, ఇచ్ఛ
మొదలగునవి మనోగుణము లనియు, న
వీనప్రకృతిశాస్త్రజ్ఞులుగూడ పరిశోధించి
సిద్ధాంతీకరించియున్నారు.

ఇంతవరకు కావింపబడిన చర్చను
బట్టి, నాకున్న నాది యనుకొన్న శరీర
మునకున్న భేద మున్న దని తేలినది.
ఈభేదము అత్యంతము కా దనియు పంచ
భూతములు శరీరాకారముగ బరిణమించి
నప్పుడు మాదకద్రవ్యము లగు తాంబూ
లపత్రాదులయందుమదశక్తి ప్రత్యేకము
గ విదితము కాకున్నను వాని సమ్మేళన
మున నది పుట్టుచున్నటుల, విజ్ఞానము క
లుగుచున్న దనియు, అవిజ్ఞానమే 'నేన'ని
యు, లోకాయతికులు చెప్పుదురు. కాని
యీవాదమును «వ్యతిరేక స్తద్భావాభా
విత్వా న్న తూపలబ్ధివత్" (బ॥సూ॥
(III 3-54) అను సూత్రమునకు తా
ము రచించిన భాష్యమునందు శ్రీశంక
రాచార్యులవారు పూర్తిగ ఖండించినా

రు. దీని సారాంశ మే మనిన? ఆత్మ దేహామునుంచి యుత్పన్నము కా లేదనియు ఈ రెండున్ను తమఃప్రకాశములవలె పరస్పరవిరుద్ధము లనియును.

ఇప్పుడు శరీరలక్షణము లేవియో కనుగొని, దానిని బట్టి 'నా'లక్షణము లేవియో తెలిసికొందము. మన శరీరము సర్వదా మారుచున్నది. అది మనము భుజించు అన్నముయొక్క పరిణామము. నిరంతరపరిణామమును స్థూలనేత్రములతో గుర్తింపలేకపోయినను, రెండు వేర్వేరు కాలములకు తగినంత యెడ మున్నచో, భేదమును మనము కనిపెట్టవచ్చును. ఒక స్నేహితుని పదియేండ్లక్రిందట చూచి తిరిగి నేను చూచుచో, వాని యాకారమునందు గలిగిన మార్పును మనము గుర్తింపగలుగుదుము. ఒకనికి పది యేండ్ల వయస్సున్నప్పుడున్ను ఇరువది యేండ్లవయ స్సున్నప్పుడున్ను, తీయబడిన ఫొటోగ్రాఫులను పోల్చి చూచినచో, కాలభేదముచే గల్గిన యాకారభేదము మనకు ఆశ్చర్యము కలిగించును. ఈమార్పు ఒక్కసారిగ కలిగినది కాదు. అది నిరంతరము కలుగుచునే యున్నది. శరీరము ఇట్లు ఎడతెగక మారుచున్నను, అనగా నిత్యము నశించుచు నిత్యము క్రొత్తగ బుట్టుచున్నను, "నిన్న ఒక పని చేసినది. నేను చేయుచున్నది నేనొకడనే" అను ఏకత్వబుద్ధి ప్రతివానికిని అనుభవసిద్ధమే. ఈ నుభవమునకు కారణము, ఏవిధమైన మార్పున్ను జెందని యొక పదార్థము మనలో నుంటయే. అట్టిపదార్థమే 'నేను''

ఈపై విచారణలను ఇంకకొంత ముందునకు సాగించెదము. శరీరము నిత్యమును మారగా మారగా, కొంతకాలమునకు మరణము అనబడు దశ ప్రాప్తించును. కాని "ఎప్పుడున్ను మార్పుజెందనివాడు" అని మీదిపేరాలో నిర్ణయింపబడిన 'నేను' మరణాత్పూర్వమువలెనే మరణానంతరమును ఒకేరీతిగ నుందును. శరీరము నశించినను, అనగా ఒకానొకవిధ మగు పరిణామమును పొందినను, నేను నశించనివాడనే యగుదును. ఈనిగమముగనే వెనుకకు జూచుచో, "నేను పుట్టనివాడను" అని కూడ సిద్ధ మగును. కావున 'నేను అజుడను, నిత్యుడను, శాశ్వతుడను.

మఱియు శరీరమునకు స్థలపరిమితి కలదు. దానికి వ్యతిరిక్తుడను, దానిని అతిక్రమించినవాడను అగు నేను అనంతుడను సర్వవ్యాపిని యగుచున్నాను. నాకు శరీరమే యున్న దనునెడల విశ్వప్రపంచమంతయు నాశరీరమే యని చెప్పవలయును. అప్పుడైనను ప్రపంచమునకు అంతము కలదు గాని నేను అనంతుడనే.

మఱియు శరీరము జడస్వభావము గలది. అది నాచేత తెలియబడుచున్నది. కావున శరీరవ్యతిరిక్తుడ నగు నేను, నాచే జ్ఞేయ మగు శరీరమునకు వ్యతిరిక్తముగ జ్ఞాతను కావలయును. ఈవిచారణను బట్టి 'నేను' సత్యమూర్తి ననియు జ్ఞానస్వరూప మనియు, అనంతుడ ననియు స్పష్టమగుచున్నది. ఈమూడులక్షణములే బ్రహ్మలక్షణములుగా "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" యని తైత్తిరీయోపనిషత్తు బోధించుచున్నది. కావున "అహం బ్రహ్మాస్మి" యను మహావాక్యము పరమసత్యము.

ఈనిర్ణయ మంతయు కేవలము దేహము (పిండము) యొక్క విచారణచే గ్రహింపబడినది. బాహ్యప్రపంచమును (బ్రహ్మాండము) పరిశోధించినను ఈసిద్ధాంతమే నిష్పన్న మగును. శరీరము చిన్నప్రపంచము (Microcosm) బ్రహ్మాండము పెద్దప్రపంచము Macrocosm శరీరము పంచభూతాత్మకము. బ్రహ్మాండముకూడ నట్లే. ఉభయములున్న ప్రకృతివికారములే. ఒకే మూలభూత మగు తత్వముయొక్క పరిణామము అనేకవిధములుగ నుండును. పిండమందున్న యణువులు బ్రహ్మాండమందు కలియును. బ్రహ్మాండమందలి యణువులు పిండమందు కలియును. ఒకప్పుడు ఒక మాదిరిగ కన్పడునది మరొకప్పుడు మారిపోవును. కావున పిండ మనియు బ్రహ్మాండ మనియు భేదము వ్యావహారిక మేకాని తాత్వికము కాదు. అంతయు ఒకటే పదార్థము. దీనిఫలిత మేమనగ? పిండమందున్న 'నేనే' బ్రహ్మాండమందున్నవాడను. అంతట నున్నవాడను 'నేనే' బ్రహ్మను.

ఈసత్యమును గ్రహించినవారే బ్రహ్మవేత్తలు. బ్రహ్మవేత్తలు అన్ని దేశములందునున్నారు. అన్ని కాలములందునున్నారు. మన దేశమునం దున్నవా రని వేఱుగ జెప్పనక్కరలేదు. మన ఒక్క దేశమునందే యున్నారని చాలమంది యభిప్రాయము. ఇతర దేశములందుగూడ నున్నవారిలో నొక్కరిని మాత్రమే యిచ్చట ఉదహరించెదను. అతడు ఏసుక్రీస్తు. ఒకానొక సందర్భమున "I and my father (God) are one" John X. 30 (నేనున్ను, భగవంతుడున్ను ఒక్కరమే) క్రీస్తు ఇట్లు పలికెను. ఇట్లు వివిధ దేశములందున్న బ్రహ్మవేత్తల యుపదేశవాక్యములవలన "అహం బ్రహ్మాస్మి" యను సత్యమును బాగుగ గ్రహించెదముగాక.

# ఉపదేశము

చంద్రు వీరేశ్వరరావుచౌదరిగారు

[ఆంధ్రవాఙ్మయసమితి]

శ్రీజనార్దను భావసీమను
 జేర్చి కొల్వుము బాలకా
చేర్చి కొల్వ శుభమ్ము లొదవును
 సిద్ధమియ్యది బాలకా
శంకరుండు జనార్దనుం డను
 శంక బూనకు బాలకా!,
శంక బూనక భజన చేసిన
 పంకము ల్విడు బాలకా!
శుష్కవాదము లాడి కాలము
 సురుగఁ జేయకు బాలకా!
శుష్కవాదము లాడ నీమది
 శూన్య మగునో బాలకా!
కూడుగుడ్డలఁ బోలు కొంచెపుఁ
 గోర్కె లడుగకు బాలకా!
కామితార్థము లొసఁగెడిని ని
 ష్కామసేవయె బాలకా!
పూని పూజ యొనర్ప మెప్పడు
 పుణ్య మబ్బును బాలకా!
పుణ్య మరిగి చరింపనేర్చిన
 పూజ్యుడగుదువు బాలకా!
దైవమే మన పోషకుం డని
 తలఁచి కొల్వుము బాలకా!
తలఁచి చిత్తమునన్ భజించిన
 ధన్యుఁడవుగద బాలకా!

# ఆయుర్వేదము

[ఆయుర్వేదోపాధ్యాయ ఉ., సూర్యచింతామణిశాస్త్రిగారు]

౧

ఆయుర్వేద మనగా జీవితమునకు హితాహితములను బోధించు విద్య. ఇది అధర్వణవేదమున కుపవేదము; శల్యతంత్రము, శాలాక్యతంత్రము, కాయచికిత్స భూతవిద్య, కౌమారభృత్యము, అగదతంత్రము, రసాయనతంత్రము, వాజీకరణ తంత్రము, అని యెనిమిది భాగములు గలదిగా నున్నది. దీనిని ముందు బ్రహ్మ స్మృతిచే నెరిగి తనపుత్రులలో సర్వకర్మదక్షు డగు దక్షున కుపదేశించె. ఆప్రజాపతి సూర్యపుత్రులును సూక్ష్మబుద్ధిశాలులు నగు ఆసత్యుడు, దస్రుడు అను

నామములుగల అశ్వినీదేవతల కుపదేశించెను. వారు త్రిలోకనాథు డగు దేవేంద్రున కుపదేశించిరి. సర్వప్రాణిహితకర మగు యీ ఆయుర్వేదమును భూలోకమందు గల ప్రాణుల హితమునకై సర్వ ఋషిజనప్రేరితుడై భారద్వాజుడింద్రునికడ కేగి రహస్యసహితముగ నభ్యసించి తన శిష్యులలో సమర్థుడగు ఆత్రేయున కుపదేశించెను. ఆత్రేయుడు ఆయుర్వేదము 16 లక్షల గ్రంథము గలదియై అతి విపులముగా నుండుటచే ఒకరే అభ్యసించుట కసాధ్య మని యెంచి తనశిష్యు లగు అగ్నివేశాదుల కుపదేశించెను. ఈవైద్యమునకు బ్రాహ్మీచికిత్స యని పేరు. సుశ్రుతుని గురువగు ధన్వంతరికూడ యీ సాంప్రదాయములోనివాడే.

భరద్వాజునకు పూర్వము అశ్వినీ దేవతలు వైద్యము చేయు కాలమున దక్షప్రజాపతి ఈశ్వరుని ద్వేషించి యాగము చేయ ఈశ్వరుడు కోపించి తత్క్రతుధ్వంసమునకై తన పుత్రుడగు వీరభద్రుడను వానిని పంపెను. అతడు తన పరాక్రమమునకు వెరచి యజ్ఞపురుషుడు లేడియై పారిపోవుచుండ యజ్ఞపురుషుని యొక్కయు యజమాని యగు ప్రజాపతి యొక్కయు తలలను త్రుంచివైచెను. గురువు పాటు చూచి శస్త్రకర్మనిపుణు లగు అశ్వినీదేవతలు ప్రజాపతియొక్కయు మృగరూప మగు యజ్ఞము యొక్కయు శిరస్సులను సంధించి సవనకర్మచేసి యథావిధ్యుక్తచికిత్సచే స్వస్థులనుగా జేసిరి.

అది తెలిసి వీరభద్రుడు తానావిద్య నభ్యసింప నెంచి చతుర్ముఖు నడుగ సావధానచిత్తులకే గాని కోపిష్టులకు ఆయుర్వేద మభ్యసింప తగినది కాదని నిరాకరించెను. అందులకు ప్రతిఫలముగా వీరభద్రుడు బ్రహ్మదేవుని మెడపై నొక త్రిశూలపుపోటు నిచ్చెను. దాన చతురాననుడు యూర్ఛిల్ల తిరిగి సూర్యపుత్రులు స్వస్థునిగా జేసిరి. అది చూచి సిగ్గుపడి వీరభద్రుడు శంకరుని కడ కేగి తనకు కలిగిన పరాభమును విన్నవించి బ్రాహ్మీచికిత్సకన్న నుత్తమమైనదియు అందు చెప్పబడని కాయసిద్ధి, రసవాదాది, విషయములు గలదియు నగు క్రొత్తచికిత్సావిధానము నిర్మింపు మని ప్రార్థింప సకలప్రాణిశంకరు డగు శంకరుడు రస, ఉపరస, సాధారణరస, లోహ ఉపలోహ, రత్నోపరత్న, పాషాణాదులతో ఔషధనిర్మాణమును ఆ ఔషధములు చిరకాల ముండినను, గుణవిహీనములు గాకుండు ఉపాయములును, కల్పించి వీరభద్రున కుపదేశించెను. ఇది మహేశ్వరునిచే నిర్మింపబడినందున మాహేశ్వరీచికిత్స యనిపేరం బిలువంబడుచున్నది. దీని నభ్యసించి దేహసిద్ధి నంది చిరకాలజీవు లయి యున్నవారు రసేశ్వరసాంఖ్యు లనబడుచున్నారు.

# ఇటలీ

(శ్రీ శేషగిరిరావుగారు)

అయిరోపాఖండములోని చదువుకొనినవారిలో ఇటలీదేశమును చూడనివా రుండరు. అచ్చటివారు దేశాటనమును విద్యాభ్యాసమున ఒక భాగముగా పరిగణించెదరు. తూర్పుఅయిరోపా నంతను ఇటాలియనులే నాగరికత కలదానిగా జేసిరి. ఇటాలియనులలో ప్రపంచమునం దంతటను ప్రసిద్ధి కెక్కిన పురుషులనేకులు గలరు. రోమకసామ్రాజ్యము ప్రపంచమునం దంతటను వ్యాపించి గొప్ప ప్రఖ్యాతిని వహించినది. రోము ఇటలీకి ముఖ్యపట్టణము. ఆసామ్రాజ్యమునకు రోమునగరమువలననే రోమకసామ్రాజ్యము అని పేరు వచ్చినది.

ఇపుడు ఆల్ప్సుపర్వతములలో దొలిచిన బిలములలోనుండి యాత్రికులు రైలుమీద ఇటలీ చేరెదరు. రైళ్ళు లేని కాలములలో ఫ్రాంసు దేశమునుండియు, స్విట్జర్లాండు దేశమునుండియు ప్రారంభమగు కొండకనుములలో నుండి వెళ్ళెడివారు. ఈపర్వతములమీద రాజబాటలు కలవు. ఇప్పు డిప్పుడు అనేకులు మోటారుకారులలో వెళ్ళుచున్నారు. పర్వతములమీది సీనరీ చాల మనోహరముగా నుండును. ఆమార్గములలో నెల్లప్పుడును సరకులబండ్లు నడుచు చుండును. వేసవికాలములో చాలమంది ఈమార్గములనుండియే వెళ్ళెదరు దీనిలో స్ప్లూజనుదారి చాలా ప్రసిద్ధి కెక్కినది. స్ప్లూజనుమార్గము ఇటలీలోని తటాకముల యొద్దనకుం గొనిపోవును. ఈప్రదేశము కన్నులవైకుంఠముగా నుండును. దేశదేశములనుండి అనేకమంది వచ్చి యిచ్చటి సృష్టివైచిత్ర్యములను జూచిపోవుచుందురు. ఇచ్చటి తటాకము లన్నిటియందును కోమో అనుపేరు గలది చాలా మనోహరముగా నుండును. ఇది పర్వతముల మధ్య నున్నది. దానిలో అనేకులు చిన్నపడవలమీద షికారు వెళ్ళుచు అత్యానందపరవశు లగుచుందురు.

ఇటలీదేశమునకు దిగుమతీచేయం బడు సరకులమీద ఆదేశపుసర్కారు చాలా యెక్కువ పన్నులు వేయుదురు. ఆ పన్నుబాధ దప్పించుకొనుటకు అనేకులు పైని చెప్పిన తటాకములదగ్గరనుండి సరకులను రహస్యముగా దేశములోనికి గొనితెచ్చెదరు. వర్తకుల ఈమోసమును పట్టుకొనుటకు నియమింపంబడిన ఉద్యోగులే వానిని కమిష్మచేసెదరు.

లంబార్డి అను ప్రదేశము ఇటలీ కంతకును ఫలవంతమైనది. ఇచ్చటివారు చాలాబుద్ధిమంతులు. ఎట్టిపని నైనను సులువుగా చేసి సుఖజీవనము చేయుచుందురు. ఇచ్చటి పట్టణములలో మిలాను చా

లాముఖ్యమైనది. ఈపట్టణమునందే మిగుల ప్రసిద్ధి కెక్కిన డ్యూమో అనుక్రీస్తుదేవాలయము గలదు

వెన్నిసుపట్టణము ప్రపంచమునందంతటను వింతయైనది. అచ్చట మామూలు వీధులు లేవు. బళ్లు లేవు. కాలువలే వీధులు, చిన్నచిన్న పడవలె బళ్లు. కాల్వల కిరుప్రక్కలను పెద్దపెద్ద మేడలు కలవు. ప్రధానవీధిని దాటు రయాల్టొవంతెన కిరుప్రక్కలను గొప్పవారి భవనములు కలవు. ఇది ౧౫౦౦ సంవత్సరములక్రిందట దేశమును నానాక్షోభల పాలు చేసిన అనాగరికజాతుల పాలయినది. అప్పుడు వారి బాధలు పడలేక అనేకులు ఇక్కడనుండి లేచిపోయి పిసో అనునది సముద్రమున కలియుచోట చిన్నిచిన్ని గుడిసెలు కట్టుకొని పల్లెవాండ్ర వృత్తి నవలంబించిరి. వారు క్రమక్రమముగా గొప్పనావికులైరి. వాణిజ్యమున పేరుగాంచి ఐశ్వర్యవంతులయిరి. తుదకా ప్రదేశము ఒక పట్టణమయ్యెను. అచ్చటివర్తకులు తమ లాభములలో చాలా సొమ్ము ఖర్చుపెట్టి ఆపట్టణమునకు శోభ గలిగించిరి. అచ్చట బురదలోను, నీటిలోను స్తంభములు పాతఁబడి గట్టిపునాదులు వేయఁబడి గొప్పభవనములు నిర్మింపఁబడినవి. ఇండను అలంకరించుటలో ఈపట్టణమునవుండువారికి ఎవ్వరును సాటిగారు. సెయింటుమార్కు (సెనమార్కో) దేవాలయము మన దేశమునందలి తాజమహాలువలె ఆశ్చర్యకరమైనది. అందు దేశదేశములనుండి దోచుకొనిరాబడిన మంచిపటములు, రాతివిగ్రహములు అనేకములు గలవు.

పైసా అనుపట్టణము చాలాపురాతనమైనది. ఇచ్చట భవనాదికములు చాలగలవు. ఇచ్చట వాలుస్తంభము ఒకటి గలదు. అది మన దేశమునందలి కుతుబుమినారువంటిది. దీనియెత్తు ౧౭౯ అడుగులు. లోభాగమున పైకి యెక్కుటకు ౩౦౦ మెట్లు గలవు. దీనికి ౧౬ అంతస్తులు కలవు. పునాదులు ఒకప్రక్క కుంగిపోవుటవలన ఇది ఆదెసకు వాలిపోయినది. ౧౧౭౦ సంవత్సరములక్రిందట అది అట్లు వాలినది. అయినను అది అట్లే యున్నది. ఇంకను ముందుగూడ అట్లే వాలియే యుండుటకు సందేహము లేదు.

ఫ్లారెన్సుపట్టణమునకు "పువ్వులపట్టణము" అని మారుపేరు గలదు. ఇచ్చట రమ్యహర్మ్యములు చాలా గలవు. ప్రసిద్ధి కెక్కిన చెక్కడపు పనులుగూడ చాలా గలవు. ఇది యేడెనిమిదివందల సంవత్సరములక్రిందట చాలాప్రసిద్ధి కెక్కినది. "డాన్టి" అను మహాకవి ఈపట్టణవాసుడే. ఇచ్చట "Brothers of Mercy" అనునది యొకటి గలదు. ఇందు పాకీవాడు

మొదలు మహారాజువఱకును అన్నితరగతులవారును సభ్యులు. వారు రోగపీడితులకు ఉపచారములు చేయుట, చనిపోయినవారిని సమాధిచేయుట, మున్నగుపనులు చేయుదురు. ఎల్లకాలములయందును కొంతమంది సేవనిమిత్తము కనిపెట్టుకొనియుందురు. వారు పనిలోనున్నప్పుడు నల్లని దుస్తులను ధరించి ముఖములు కనఁబడకుండునటుల ఒకవిధ మయిన టోపీని ధరింతురు. వారు బహుమానపూర్వకముగా గిన్నెడు (Cup) నీళ్ళు తక్క మరేమియు పుచ్చుకోరు.

ఆపట్టణప్రజలు యెప్పుడును సంతోషముతో నుందురు. వారికి పండుగులు చాలాగలవు. అన్నిపండుగులలోను "పావురముపండుగు (Feast of the dove) చాలాముఖ్యమైనది. అచ్చటి దేవాలయముముందు ఒక గొప్పరథము ఉండును. దానిని తోరణములతోడను పూవులతోడను అలంకరింతురు. లోపల టపాకాయలు అమర్పఁబడియుండును. దానిని నాలుగు తెల్లని యెద్దులు లాగును. దేవాలయములోనుండి ఒక తెల్లనిపావురము నోటిలో నిప్పు ఉంచుకొని ఒక తీగె మీదనుండి జారుచు రథముమీదికి వచ్చి దానికి నిప్పు ముట్టించును. దీనిని జనులు తండోపతండములుగా వచ్చి చూచెదరు. రథములోని టపాకాయ లన్నియు బాగుగ ప్రేలినచో ఆసంవత్సరము పంటలన్నియు చాలా బాగుగా నుండు ననియు, లేకున్న పంటలు చెడిపోవు ననియు వారి నమ్మకము.

రోమునగరము ౨౭౦౦ ల సంవత్సరముల క్రిందట స్థాపింపఁబడినది. అప్పటినుండియు ఆనగరము ప్రసిద్ధముగనే యున్నది. కొన్నిశతాబ్దములు ఇది ప్రపంచచరిత్రమున వర్ణింపఁబడిన గొప్పసామ్రాజ్యమునకు ప్రధానసగరము. చక్రవర్తులు పోయినతరువాత నిది పోపు అనఁబడు క్రీస్తుమతాధికారికి ఉనికిపట్టు అయినది. మొదట క్రీస్తుమతమువారు చాలా బాధలు పొందిరి. లక్షలకొలఁది జనులు చూచుచుండ క్రైస్తవులను పులులకును సింహములకును ఆహారముగా వేసెడువారు. ఆజంతువులకు క్రౌర్యము మరింత పెరుగుటకు క్రైస్తవులను మీఁదికి త్రోయుటకుముందు కొన్నిదినములు పస్తు పెట్టెడివారు.

ప్రపంచములో నెల్ల గొప్ప క్రీస్తుదేవాలయ మగు సెయింటుపీటర్సుచర్చి ౩౦౬ వ సంవత్సరమున నిర్మింపఁబడి తరువాత ౧౪౫౦ వ సంవత్సరమున ఇప్పటి దివ్యభవనముగా సంస్కరింపఁబడుటకు ప్రారంభింపఁబడినది. ఇది పూర్తియగుటకు ఇంచుమించు రెండువందల సంవత్సరములు పట్టినది. దానిలోపలికి వెళ్లిన

వెంటనే జనులు పరవశులగుదురు. లోపల చలువరాళ్లు పరచిన పెద్దచావడి కలదు. అది ౬౦౦ అడుగుల పొడుగు. సలువ (Cross) క్రింద ౪౧౨ అడుగుల వెడల్పు, ౪౦౦ అడుగుల యెత్తు కలది. దానిని చూచినవారికి మనుష్యులు అంతకంటె ఉత్కృష్టకార్యము చేయుట అసాధ్యమనిపించును. క్యూపోలాఅను (Cupola) కొప్పు నాపుటకు నాల్గుపెద్ద స్తంభములు గలవు. ఒక్కొక్కస్తంభముయొక్క చుట్టుకొలత ౧౩౨ అడుగులు.

ఇందులో గోరీలు (Statues) అపరిమితముగ గలవు. సకలదేశములందును ప్రసిద్ధిబడసిన సెయింటుపీటరుయొక్క కంచుబొమ్మ యిందు గలదు. దీనిమీద యాత్రికులకు చాలాభక్తి యుండును. ఈబొమ్మ కుడికాలు యాత్రికుల ముద్దుల వలన అరిగిపోయినది.

ఇప్పటిరోము పూర్వకాలపు శిథిలములమీద కట్టబడినది. ఆకారణమున ఎక్కడ త్రవ్విన నక్కడ పూర్వపురోము చిహ్నములు కాన్పించును. ఆరోజులలో భవనములు యెల్లకాలమును ఉండునట్లు కట్టిరి. దానిమీదికి దండెత్తివచ్చినవారు కొంతవరకు నాశనము గావించిరి. మిగిలియున్నదానిని కాలముమంటిక్రింద కప్పివేసినది. ప్రతిగృహమునందును పూర్వకాలపురాతిబొమ్మలో చలువరాళ్లో ఉండును.

పూర్వము జరూసలేమును జయించిన సేనాధిపతికి స్వాగతమిచ్చుటకిచ్చట నొక స్వాగతమందిరమును గట్టిరి. తమజరూసలేము పట్టణమును పట్టినవానిని గౌరవించుటకు కట్టఁబడినది; గాన యిప్పటికిగూడ యూధు లెవరును దానిక్రింద నుండి వెళ్ళరు.

రోమునగరమునుండి వెళ్లు రాచబాటలో "అప్పియమ్" అనునది చాలా గొప్పది. పెద్దపెద్దరాళ్ళతో దానిని అతికిరి. ౨౦౦౦ సంవత్సరములు దాటినను అది యిప్పటికిని క్రొత్తదిగనే యున్నది.

నేపిల్సుపట్టణము ఇటలీదేశముయొక్క దక్షిణభాగమునం దెల్ల గొప్పది. ఇది చాలమనోహరముగా నుండును. "నేపిల్సు చూడని జన్మ నిరర్థకము" అని సామెత కలదు. ఇచ్చటిప్రజలు ఎల్లవేళలయందును ఆడుచు, పాడుచు, నవ్వుచు ఉందురు. అచ్చటివారందఱును వీధులయందే కాలము గడుపుచుందురు. రాత్రులయందు నిదురించుటకుమాత్రమే యిండ్లకుఁ బోవుదురు. వేసవికాలములో పడకలుగూడ బైటనే. ఇచ్చట చాలామంది పేదలు అయినను ఇచ్చటి పేదరికము భయంకరముగా నుండదు. గర్భదరిద్రుండయినను చిన్నరొట్టెముక్క ఒక యుల్లిపాయ తిని రోడ్డుమీద పండుకొని సంతుష్టుఁడై యుండును. ఎవ రయిన బహూనాగా

న మానపెట్టి చిన్నపని చెప్పినను చేయ రు. వారికి రంగు లన్న చాలాప్రీతి. బట్ట లు, దుకాణములు, వస్తువులు అన్నియు వివిధము లగు రంగులు గలవిగా నుండు ను. అచ్చట నూటికి తొంబదిమందికి వీ థియే వంటిల్లు. అక్కడ ఎక్కడ చూచిన ను తినుబండములను విక్రయించుదుకాణ ములే. ఇచ్చటిప్రజలు లాటరీ అనిన చెవి కోసుకొందురు. ఇది సర్కారు అధీన మున నున్నది. ఈలాటరీవ్యాపారమువల న సర్కారుకి చాలాఆదాయము వచ్చు చుండును. ఈలాటరీకి సంబంధించి ఒక నిఘంటువు కలదు. ప్రతివాడును దానిని చూసి ఆయాచీట్లను కొనును.

ఈనేపిల్సుపట్టణమునకు "వెసూవి యస్" అను అగ్నిపర్వతము కనఁబడు చుండును. ఎల్లప్పుడును దానిరంధ్రముల నుండి పొగ లెగయుచునే యుండును. వా నినిచూచి అచ్చటివారు చాలాభయపడు చునేయుందురు. ౧౫౦౦ ల సంవత్సరము లకు పూర్వము చాలాభయంకరములైన నిప్పులు మొదలయినవి వచ్చినవి. అప్పుడు హెర్క్యులీనియము, పాంపే అను పట్టణ ములు నాశనమైనవి. పాంపే అపుడు చాల ఉచ్చదశలో నుండెను. మధ్యాహ్నము నల్లని పొగలు ఆకసమునకు లేచెను. మిట్టమధ్యాహ్నము ఈపొగవలన చిమ్మ చీకటి కప్పెను. ఆపర్వతరంధ్రమునుం డి వచ్చు మంటల వెలుగు తప్ప మరియే వెలుగును లేకపోయెను. చాలామంది ప ట్టణము విడచిపోయిరి; కొంతమంది అది వెంటనే తగిపోవు నని అక్కడ నయుండిరి. కాని మంటలు అట్లుండగా రాళ్ళవర్షము గూడ ప్రారంభమయ్యెను. వీథులు, ఇండ్లు రాళ్ళతో నిండిపోయెను. తలుపులు వేసి కొని యిండ్లలోనున్నవారుమాత్రము బ్ర తికియుండిరి.. కొంతసేపటికి ఆపర్వతము నుండి నల్లని(Lava) ప్రవాహము బయ లువెడలెను. ఇది పట్టణ మంతయు వ్యా పించి పూర్తిగా నాశనము చేసెను. ఈ సంగతియే తరువాత ప్రజలు మరచిపో యిరి. ౧౯ వ శతాబ్దిమధ్య ఇది త్రవ్వుట కు మొదలుపెట్టఁబడినది. పాంపేమీద ఒక్క రాళ్ళవర్షముమాత్రమే కురియుట లన ఇండ్లలోని వస్తువు లన్నియు చెడి పోక నున్నవి. గోడలమీద వ్రాతలు, చిత్తరువులు అన్నియు ఇప్పుడు వ్రాసిన ట్లే యున్నవి. ఆపట్టణమును ఆరాళ్ళవర్ష ము బాగుగా దాచియుంచినది. ఆపట్టణ ద్వారమున పారా యిచ్చువాడు (వాని యస్థిపంజరము) అట్లే యున్నది. ఒకచేత కత్తి యున్నది. రెండవచేతితో విషవా యుబాధ లేకుండ జేసికొనుటకు గుడ్డను ముక్కువద్ద పెట్టుకొనియున్నాడు. ఒక పావురము ఒకగోడసందున గూడుకట్టుకొ

... గుడ్డగా
ఎడిచి పెట్టబడిం
మంచి దినుసగొనినది.

...లోని ప్రజలు యిండ్లనిమి త్త
...అంత గా శ్రద్ధపూనరు. వారు చా
...కాలము విధులయందే గడపెదరు
...ప్పవారుమాత్రము పెద్దపెద్దభవనముల
...లో నివసించెదరు. ఇవి చలికాలములో
...మియు వీలుగా నుండవు. వానిలోనిగ
...దులు చాలాపెద్దవిగా నుండును. ఒకపెద్ద
...ల్లు అంతస్తులక్రింద విభజింపబడియుం
...ను. అందులోని మంచివాటాలలో గొ
...ప్పవారు ఉందురు. చివరిఅంతస్తులో చి
చిన్నగుడిసెలవలెనుండు గదులలోను
...ది గదులలోను బీదవారు ఉందురు

ఇచ్చట జీతములు చాలాతక్కువ
...వైద్యులకు సాలుసకు రమారమి

...గింది రూపాయల ఆదాయముండును.
ప్లీడరు ఆదాయముగూడ అంతే. ఈ రెం
డు పనులయందునుగూడ చాలామందికి
కొద్దిఆదాయములేయుండును. చాలామం
ది సర్కారు ఉద్యోగములలో ప్రవేశింతు
రు. ఇంగ్లండులో ప్రతివానికిని ఏడాదిక
రాబడి రెండు రెండున్నర వేల రూపాయలు. ఇటలీలో
...రూపాయిలు.

ఈదేశమున పిల్లలను చాలాగారా
...ముగా పెంచెదరు. అందరును వారడిగి
న వెల్ల యిచ్చెదరు. ఇటలీలో సేద్యగాని
జీవనము చాలకష్టమైనది. వారు శీతకా
లములో చాలాబాధపడుదురు. మంచ
సామాను ఉపయోగించి వారు భూమిని
బాగుగా దున్నరు పైగా పన్నులు హె
చ్చు అక్కడ సేద్యగానికి చాలాఓర్పు
ఉండును. కష్టములకు అతడు వెనుదీయడు.

# ప్రకటన